ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 సంచిక : 5 జనవరి 2022





రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

అహం బ్రహ్మాస్మి ........................................ 2


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 3

భగవద్గీత - శ్లోకం 2-66 .................................. 26

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



విష్ణువు అంటే ఒక వ్యక్తి కాదు

వ్యాపించినవాడు అని అర్థం.

అంతటా వ్యాపించి ఉన్నది

ఆత్మే. అంటే విష్ణువుని

ఆరాధించేటప్పుడు కూడా

మీకు తెలియకుండా మీరు ఆత్మని తెలుసుకోవటానికే

ప్రయత్నిస్తున్నారు.

# అహం బ్రహ్మాస్మి

వేద వాక్యం “అహం బ్రహ్మాస్మి” అంటే అర్థం నేను బ్రహ్మ స్వరూపమును అని. నేను అంటే ఏమిటి? అనేక వికారాలతోటి, రాగద్వేషాలు, కామక్రోధాలు, హెచ్చుతగ్గులు తోటి, మెరక పల్లాలతోటి కూడుకున్న నేను అహం బ్రహ్మమా? మనం నేను నేను అంటున్నాము కదా? తెల్లవారుజాము ఐదింటికి లేచింది మొదలు సాయంత్రం పడుకునే వరకూ ఎన్నిసార్లు అంటున్నాము నేను అని! అన్నిటికంటే ఎక్కువ ఉపయోగించేది అదే. మరి ఈ నేనుని తెలుసుకోవటానికి మీరెవరూ ప్రయత్నం చేయరా?

దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడు అదే అంటా ఉంటాడు, దేవుడు లేడు అని చెప్పేవాడు అదే అంటా ఉంటాడు. దేవుడు లేడు అని చెప్పేవాడికీ ఇదే పని, రోజూ నేను నేను అంటాడు. ఆ నేనుని వాడు విడిచిపెట్టడు. పైగా నేను అంటే మనకంటే వాడికి ఎక్కువ ఇష్టం. భక్తుడి కంటే భక్తి లేని వాడికి మరీ ఎక్కువ ఇష్టం నేను అంటే.

అహం బ్రహ్మాస్మి అంటే నేను బ్రహ్మ స్వరూపమును అని. ఆ నేను, ఈ రాగద్వేషాలతో కూడుకున్న పరిమితమైనటువంటి, ఈ మనస్సుకి సంబంధించినటువంటి, అహంకారానికి సంబంధించినటువంటి నేను కాదు. లోపల ఆత్మే ఆ బ్రహ్మ స్వరూపం. అంటే నువ్వు ఎవరవు, ఆత్మ స్వరూపం. నీకు తెలియక అహంకారస్వరూపుడను అనుకొంటున్నావు. మీరు అనుకొనే నేను మట్టుకు బ్రహ్మ స్వరూపం కాదు, అది తెలుసుకోండి. పుస్తకాలు చదవటం వల్ల ఇదే ప్రమాదం. పుస్తకాలలో నేను బ్రహ్మ స్వరూపం అని ఉంటుంది. నేను అంటే మీరు అనుకొనే నేను అని కాదు. మీ లోపల హృదయంలో ప్రకాశిస్తున్నటువంటి ఆత్మ స్వరూపం, ఆ నేను బ్రహ్మస్వరూపం. అంతేకానీ మీరు అనుకొనే నేనుకి ఆ బ్రహ్మస్వరూపానికీ ఎట్టి సంబంధమూ లేదు. కొంచెము కూడా అణుమాత్రమూ సంబంధం లేదు. ఈ దేహం పుట్టినప్పుడు కానీ, ఈ దేహం పెరిగినప్పుడు కానీ, ఈ దేహం స్మశానంలో కాలి బూడిద అయినప్పుడు కానీ ఆత్మలో మార్పు ఉండదు. కొన్ని శరీరాలు కాలుస్తారు, కాల్చినవి బూడిద అవుతాయి కొన్ని శరీరాలు కప్పెడతారు, కప్పెట్టినవి మన్ను అవుతాయి. కానీ మీలో ఈ దేహముతో ఎట్టి సంబంధమూ లేనటువంటి నేను ఉంది. మీ ఇంద్రియాలతోటి కానీ, మీ దేహంతోటి కానీ, మీ మనస్సుతోటి కానీ, మీ బుద్ధితోటి కానీ, దేనితోటీ సంబంధం లేని నేను ఉంది. అది స్వయంప్రకాశం, దానికి లైటు అక్కరలేదు సూర్యుడు అక్కరలేదు. మనం ఏదైనా ఒక వస్తువుని చూడాలంటే పగలేమో సూర్యుడు ఉండాలి, రాత్రి అయితే దీపం ఉండాలి. అయితే ఆ స్వరూపం మనకి అనుభవంలోకి వచ్చినప్పుడు, అది మనకి కనిపించటం కోసం, సూర్యుడి సహాయం అక్కరలేదు, వెలుగు సహాయం అక్కరలేదు. ఆ నేనుమీరు అనుకొనే నేను కాదు. ఆ నేనుకి మీ దేహానికి కొంచెము కూడా, కించిత్తు కూడా సంబంధం లేదు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 11 జనవరి 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మతం అంటే ఎప్పడో మరణించిన తరువాత కైలాసానికి వెళ్ళటం, వైకుంఠానికి వెళ్ళటం అని చాలామంది అభిప్రాయం. అది మతం యొక్క పరమార్థం కాదు. వినదగినది, ఆలోచించదగినది, అనుభవంలోకి తెచ్చుకోదగినది మతం. మనస్సులో ఎదగని వాడు ఆధ్యాత్మిక విద్య వినడానికే పనికి రాడు. గౌతమ బుద్ధుడు "కాలే ఇటుకల బట్టీ మీద కూర్చోపెడితే ఆ మనిషి ఎలా ఉంటాడో, మనస్సులో నిర్మలత్వం లేని మనుషులు, మనస్సులో ఎదుగుదల లేని మనుషులు, అలాగే ఉంటారు" అని చెప్పాడు. అంటే అంత చపల చిత్తంగా ఉంటారు. వాళ్లకి అసలు శ్రవణం చెయ్యడానికి కూడా అర్హత లేదు. మనం మనస్సులో ఎదగడం లేదు అనుకోండి ఆధ్యాత్మికంగా విషయాలు ఎలా తెలుసుకోగలం? మనస్సు తోటి కదా గ్రహించవలసినది. భగవాన్ అంటే శరీరం కాదు, భగవాన్ అంటే ఎవరు? ఆత్మ. ఆత్మ ఇప్పుడు లేకుండా పోయిందా? ఒకవేళ నిజంగా ఆత్మ ఇప్పుడు లేకుండా పోతే అటువంటి ఆత్మ మనం తెలుసుకోవడం ఎందుకు? ఒకప్పుడు ఉండి, ఒకప్పుడు లేని వస్తువును మనం తెలుసుకోవడం ఎందుకు? అంటే భగవాన్ ఇప్పడు లేరు అని అనుకోవడం కూడా అపచారం. ఎందుచేత? భగవాన్ అంటే మనకు శరీరదృష్టి ఉంది కాబట్టి ఆ శరీరం ఇప్పుడు లేదు కాబట్టి లేరు అనుకుంటున్నాం. భగవాన్ శరీరం ఉన్నప్పుడు కూడా ఆ శరీరం కాదు. భగవాన్ అంటే ఎవరు? ఆత్మ. ఆత్మ ఇప్పుడు ఉందా? లేదా? ఉంది. ఆత్మ శాంతిస్వరూపం, అనుగ్రహ స్వరూపం. ఆత్మకి మరొక పేరే అనుగ్రహం. ఏ శరీరం వచ్చినా అక్కడ ఆత్మ యొక్క అస్థిత్వం ఉన్నట్టే! ఆత్మ యొక్క అస్థిత్వం లేకపోతే శరీరం రాదు.

మనకి ఎందుకు మోహం కలుగుతోంది? మనకి ఆత్మదృష్టి లేదు, రూపదృష్టి ఉంది. రూపదృష్టి ఉంది కాబట్టి మోహం కలుగుతోంది, ఆత్మదృష్టి కనుక వస్తే మనకి ఇంక అసలు మోహం కలగనే కలగదు. రూపం మనిషిని బంధిస్తుంది, మోహ పెడుతుంది. మన అందరికీ రూపదృష్టి ఉంది కాబట్టి మోహంలో పడుతున్నాం. రూప దృష్టికి మూలం ఏది? ఆత్మ. రూపం లేకుండా ఆత్మ ఉండగలదు. కానీ ఆత్మ లేకుండా రూపం ఉండలేదు. మనకి చిన్న చెడు తలంపు వస్తుంది అనుకోండి, అది చిన్నదే కదా అనుకుంటాం. మళ్లీ రేపు వస్తుంది అనుకోండి, చిన్నదే కదా అనుకుంటాం. చిన్నవి చిన్నవి కలిపి పెద్దవి అవుతాయి. అక్కడ నుంచి మన స్వభావం మారిపోతుంది. అంటే ఆత్మని తెలుసుకోవడానికి అర్హత

లేకుండా పాడైపోతాం. అంటే తలంపుల విషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి.

వర్తమానాన్ని విడిచి పెట్టద్దు అని పరమాత్మ చెప్పాడు. నీ మనసును పరిశీలించుకో, నిన్ను పైకి తీసుకు వచ్చేదీ నీ మనస్సే. నిన్ను పతనం చేసేదీ నీ మనస్సే. అంటే నీ మనస్సు విషయంలో నువ్వు బహు జాగ్రత్తగా ఉండు అది ఎలా పనిచేస్తోందో చూడు. నిన్ను సోర్స్‌లోనికి తీసుకువెళ్ళేదీ నీ మనస్సే. నిన్ను పతనం చేసేదీ, బహిర్ముఖం చేసేది నీ మనస్సే. అందుచేత నువ్వు ఉద్ధరింపబడాలి అంటే నీ మనస్సుని నువ్వు జాగ్రత్తగా చూసుకో. నీ మనస్సుని నువ్వు జాగ్రత్తగా చూసుకోవాలి అంటే వర్తమాన కాలంలో ఎక్కువ attentionగా ఉండు. అంటే జరిగిపోయిన గొడవల గురించి అస్తమాను తలపెట్టుకోకు. జరగబోయే గొడవల గురించి ఆలోచించకు. వర్తమానంలో జీవించు. మనకి ఎంతోకొంత దుఃఖం వస్తోంది కదా, ఇంటిలో ఉన్న పరిస్థితులు ద్వారా, సమాజంలో ఉన్న పరిస్థితులు ద్వారా, నూటికి పది వంతులు మనకి దుఃఖం వస్తే, మిగతా తొంబై వంతులు కూడా మన మనస్సు కల్పించేదే. మీరు జాగ్రత్తగా పరిశీలన చేసుకోండి. మన మనస్సుని ఎదగనివ్వాలి. ఎవరి సహవాసం వల్ల మన మనస్సు వికసిస్తుందో, ఎవరి సహవాసం వల్ల మన మనస్సు ఎదుగుతుందో, వారితో మనం సహవాసం చేయాలి.

విభీషణుడికి రావణాసురుడు స్వయంగా అన్నగారే అయినప్పటికీ భగవంతుడు కోసం, తాను వికసించడం కోసం, తన ముక్తి కోసం తన అన్నగారైన రావణాసురుడిని విడిచి పెట్టాడు కాబట్టే మహా భక్తుడు అయ్యాడు. మన అన్నగారే కదా, అతనికే సపోర్ట్ ఇద్దాం అనుకుంటే విభీషణుడికి పతనం ఏనాడో ప్రారంభం అయ్యేది. భగవంతుడి కోసం తన అన్నని కూడా విడిచి పెట్టాడు. మనస్సు యొక్క వికాసం ముఖ్యం. మనస్సు యొక్క వికాసం లేకుండా ఆధ్యాత్మిక చింతనకి ఏ మనిషి అసలు పనికే రాడు. మనస్సు ఎదగాలి. కొంతమంది మనుషుల తోటి సహవాసం వల్ల మన మనస్సుని ఎదగనివ్వరు వాళ్ళు! అది మనకు తెలుస్తూ ఉంటుంది. అప్పుడు వెంటనే ఆ స్నేహాన్ని కట్ చేసుకోవాలి. కత్తిరి తోటి గుడ్డ కత్తిరించినట్టు కత్తిరించుకోకపోతే మటుకు మనకి చెడు లోకాలు తప్పవు. అందుకే మనం వర్తమానంలో జీవించటం నేర్చుకోవాలి. స్నేహాల విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి.

ఏమండీ, ఒకరి ఇంట్లో బంగారం ఉంది, వెండి ఉంది, ఇత్తడి ఉంది, రాగి ఉంది అనుకోండి, ఆ యజమాని బంగారం, వెండి బయట పడేసి, ఇత్తడి, రాగి లోపల దాచుకుంటున్నాడు అనుకోండి. అప్పుడు మనకి ఏమనిపిస్తుంది? వాడు ఎంత అమాయకుడు. వాడికి మైండ్ దెబ్బతింది అనుకుంటాం. ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే మన పరిస్థితి కూడా అదే. అంటే మనం ఆత్మను వదిలేస్తున్నాం. భోగాలని దాచుకుంటున్నాము.

అంటే ఏదైతే మనకి సుఖాన్ని కలిగిస్తుందో అది వదిలేస్తున్నాం. ఏదైతే దుఃఖాన్ని తీసుకు వస్తుందో దానిని దాచుకుంటున్నాము. ఇలా చేస్తున్నాం అన్న సంగతి కూడా మనకి తెలియదు. మనకి తెలియకుండా మనం చేసే పనులు. ఎవరైనా మనలని హింస పెడితే, ఎవరైనా కష్టమైనా మాట అంటే మనకి ఎంతో ఆందోళన కలుగుతుంది. హింసలకి గురి అవ్వకుండా, కష్టమైనా మాటలు భరించకుండ, ఈ ప్రపంచంలో ఎవ్వడూ మహాత్ముడు అవ్వలేడు.

అసలు నీకు విద్య నేర్చుకోవాలని తపన ఉండాలి కానీ ఏదో ఒక రూపంలో నీకు వస్తుంది. నీ హృదయంలో తపన అంటూ బయలుదేరితే ఈశ్వరుడు గురువుని నీ దగ్గరికే పంపిస్తాడు. తపన మటుకు నీ హృదయం లోంచి రావాలి. నటించటం కాదు. హృదయం లోంచి తపన రావాలి. సూరదాసు గుడ్డివాడు. కృష్ణభక్తుడు చిన్నతనంలో ఆయనకు విద్య నేర్చుకోవాలని ఉండేది, వాళ్ళ నాన్న అన్నదమ్ములు అందరికీ విద్య చెప్పేవాడు, ఆ ఇంటి పక్కవాళ్ళకి విద్య చెప్పేవాడు, ఒకసారి వాళ్ళ నాన్నతో నువ్వు అందరికీ చదువు చెబుతున్నావు, నాకు కూడా చదువు చెప్ప అన్నాడు సూరదాసు. (నువ్వు గుడ్డివాడవు, గుడ్డివాడికి చదువు ఏంటిరా, మీ అమ్మ దగ్గరకి వెళ్ళి కూర్చో అన్నాడు.) ఈయనకి చదువు నేర్చుకోవాలని, అభివృద్ధిలోకి రావాలని తపన హృదయంలో, ఆ హృదయంలో తపన గ్రహించలేదు తండ్రి. తన తండ్రి అంటున్నాడు సూరదాసుని, నువ్వు గుడ్డివాడవురా, నీకు చదువు ఏంటి? వెళ్ళి నువ్వు మీ అమ్మ దగ్గర కూర్చో, ఏమి పనికిరాడు అని తల్లి కూడా లోకువగా చూసేది. నేను బయటకి వెళితే నన్ను అందరూ గుడ్డివాడు అంటున్నారు అమ్మా అనేవాడు సూరదాసు. అవును నిజమే, గుడ్డివాడవు కాబట్టే, గుడ్డివాడు అంటున్నారు. అందుకే నువ్వు వీధిలోకి వెళ్ళకు అని చెప్పేది ఆ తల్లి, మరి వీధిలోకి వెళ్ళకుండా ఇంట్లో ఎంతసేపని కూర్చుంటాడు? తండ్రిని చూస్తే విద్య నేర్పటం లేదు, తల్లి నేర్పటం లేదు, అన్నదమ్ములని అడిగాడు అట నేర్పమని, మీరు చదువుకుంటున్నారు కదా విద్య నాకు నేర్పండి, నాకు చదవటం చేతకాదు కదా నాకు కళ్ళు లేవు. నాకు విద్య నేర్పండి అన్నాడు సూరదాసు. సహజంగా అతను కృష్ణ భక్తుడు. ఇవన్నీ కృష్ణుడు చూస్తున్నాడు.



**మీలో ఎవరికైనా క్రూరత్వం ఉంటే తగ్గించుకొని దయాస్వభావమును పెంచుకోండి. దయగల హృదయంలోనే దేవుడు సాక్షాత్కరింపబడతాడు. దయగల హృదయమే భగవంతుని నిలయం అని అర్థం.**

అన్నదమ్ములను అడిగాడు చెబుతారమో అని, నువ్వు వంట నేర్చుకోరా నీకు చదువు ఏమిటి? నీకు కళ్ళు లేవు, నువ్వు అమ్మ దగ్గర పడి ఉండి నీకు చేతనైతే వంట నేర్చుకో, వంట నేర్చుకుంటే ఏమైనా వంట వస్తుందేమో కొంతకాలానికి నీకు, కానీ అతని తపన ఏమిటి? చదువు నేర్చుకోవాలి, చదువు నేర్చుకోవాలి. ఒకరోజున ఇంటికాడ కూర్చొన్నాడు. ఎవరూ చదువు చెప్పటం లేదు. నేర్చుకోవాలని ఉంది. నాకు విద్య కావాలి ఇప్పుడు, నాకు అన్నం కాదు ముఖ్యం, నాకు విద్య కావాలి. తల్లి చెప్పటం లేదు. తండ్రి చెప్పటం లేదు. అన్నదమ్ములు చెప్పటం లేదు. ఎవరూ చెప్పటం లేదు. నాకు విద్య నేర్చుకోవాలని ఉంది. ఎవ్వరూ చెప్పటం లేదు. వీధిలోకి వెళితే హేళన చేస్తున్నారు. గుడ్డివాడు అంటున్నారు కానీ చదువు చెప్పటానికి ఊర్లో వాళ్ళు కూడా ఎవరు ఎదరకి రావటం లేదు. ఎవరో ముష్టి వాళ్ళు కృష్ణుడి మీద పాటలు పాడుకుంటూ రోడ్డు వెంట పోతూ ఉంటే పోనీ ఆ పాటలు అయినా నేర్చుకుందాం అని ఇంటిలో చెప్పకుండా ఆ ముష్టివాళ్ళ వెనకాల వెళ్ళిపోయాడు సూరదాసు. అంటే విద్య పట్ల అతనికి ఉన్న తపన. ఆయన ఇల్లు కూడా విడిచి పెట్టేశాడు. వాళ్ళేమి చేశారు? ఏదో ఒక పాట, రెండు పాటలు నేర్పారు, నేర్పివీడు గుడ్డివాడు ఎప్పటికైనా మనకి బరువు అవుతాడు అని వాళ్లకి అనిపించింది. వాళ్ళు ఏమి చేశారు ఒక రాత్రి నిద్రపోతుంటే, ఈ గుడ్డివాడిని ఒక్కడినే విడిచి పెట్టేసి ఆ ముష్టి వాళ్ళు అందరూ వెళ్ళిపోయారు. అప్పుడు కూడా సూరదాసుకు విద్య తృష్ణ పోలేదు. ఏ గ్రామంలో అయితే ఈ ముష్టివాళ్ళు విడిచి పెట్టారో, ఆ గ్రామంలో ఉండి అతను తపస్సు ద్వారా కొంత విద్యని సాధించాడు. కేవలం పుస్తకాలు చదవటం వల్లనే విద్య రాదు. తపస్సు వల్ల కూడా విద్య వస్తుంది. తపస్సు ద్వారా అనేక కీర్తనలు పాడతాడు కృష్ణుడు మీద, మహాత్మాగాంధీ గారు తన ప్రార్థన సమయంలో తప్పనిసరిగా ఈ సూరదాసు పాటలు పడుకునేవారు. తులసీదాసు రామ భక్తుడు, సూరదాసు కృష్ణ భక్తుడు. ఈ సూరదాసు పాటలు, తులసీదాసు పాటలు మహాత్మాగాంధీ గారు ప్రతిరోజు పాడుకునేవారు. సూరదాసుకు కృష్ణ భక్తి వలన, ఆ తపన వలన, ఆ తపస్సు వల్ల ఆయనకు కవిత్వం కూడా పుట్టుకు వచ్చింది. మాములు చదువు కాదు తన హృదయం లోంచి పద్యాలు, పాటలు రాయగల శక్తిపుట్టుకు వచ్చింది సూరదాసుకి.

ఇది అంతా ఆయనకు ఎవరు నేర్పారు? ఆ తపన వల్ల వచ్చింది. అప్పడు అక్బరు చక్రవర్తి స్వయంగా సూరదాసు పాటలు వినడానికి తన సంస్థానానికి పిలుస్తాడు. కృష్ణుడు యొక్క కోర్టులో తప్పించి రాజుల యొక్క కోర్టులో నేను పాటలు పాడను అంటాడు సూరదాసు. భగవంతుడి కోర్టులో పాడతాను కానీ వాడు ఎంత చక్రవర్తి అయినా సరే వాడి సంస్థానంలోకి వెళ్లి నా పాటలు పాడను అంటాడు సూరదాసు. తను ధరిద్రం

అనుభవిస్తూ, ఆ గ్రామస్తులు ఏది పెడితే అది తింటూ భగవంతుడి కోర్టులో పాటలు పాడతాడు కానీ డబ్బులకి ఆశపడి కానీ, బహుమానాలకి ఆశపడి కానీ, సన్మానాలకి ఆశపడి కానీ అక్బరు చక్రవర్తి కోర్టుకి వచ్చి పాటలు పాడేవాడు కాదు సూరదాసు. అక్బరు సంస్కారం ఉన్నవాడు, సభ్యత ఉన్నవాడు అక్బరు. ఆయనే స్వయంగా సూరదాసు దగ్గరకి పాటలు వినడానికి వస్తాడు. ఇంతకి ఈ మాటలు ఎందుకు చెబుతున్నాను అంటే సూరదాసు చరిత్ర చెప్పటం కోసం ఈ మాటలు చెప్పటం లేదు. ఈ struggleలో, ఈ పోరాటంలో, అక్కడ మనసు ఎంత వికసించింది అంటే అక్బరు చక్రవర్తి లాంటివారు సూరదాసుని చూడటానికి వెళుతున్నారు, రాజులు వెళ్తున్నారు సూరదాసుని చూడటానికి. మన సోదరుడిని చూడటానికి మనం కూడా వెళదాం అనుకొని సూరుదాసు ఉన్న ఊరుకు అన్నదమ్ములు కూడా చూడటానికి వెళతారు. ఈ ఒక్క సంఘటన చెప్పటం కోసం సూరదాసు విషయం చెబుతున్నాను. అంతకుముందు వాళ్ళు సూరదాసును తమ్ముడు అనేవారు కాదు, గుడ్డివాడు అనేవారు. ఇప్పుడు ఏమంటున్నారు అంటే నువ్వు మా తమ్ముడవు. నువ్వు ఇంటికి వచ్చేయ్. నిన్ను మేము అవమానాలు చేసిన మాట నిజమే. నీకేమి మేము బహుమానాలు ఇవ్వలేదు. కానీ అవమానాలు చేసిన మాట నిజమే. కానీ ఇంటికి వచ్చేయ్. నిన్ను మేము ప్రేమగా చూస్తాం. మనం అందరం సోదరులం, మనం అందరం బంధువులం అంటున్నారు. అప్పుడు సూరదాసు ఏమన్నాడు అంటే నిజమే మీరు నాకు అన్నదమ్ములే. మీరు అందరూ నాకు బంధువులే, నేను కాదు అనటం లేదు. కాని ఇప్పుడు నాకు మానవజాతి అంతా బంధువులే అంటున్నాడు. ఈ మాట ఒక్కమాట చెప్పటం కోసం సూరదాసు గురించి చెప్పాను. అంటే అతని మనసు ఎంత వికసించిందో చూడండి. మీరు బంధువులే, మీరు నాకు అన్నదమ్ములే. అమ్మ ఉంది, నాన్న ఉన్నాడు, మీరు అందరూ నాకు బంధువులు కాదు అనటం లేదు. కానీ ప్రపంచంలో మానవులు ఏ మూలన ఉన్నా జాతితో సంబంధం లేకుండా, కులంతో సంబంధం లేకుండా, దేశంతో సంబంధం లేకుండా మానవ జాతి అంతా కూడా నా బంధువు జాతే. మీరే నా బంధువులు కాదు, మానవులు అందరూ నా బంధువులు అంటాడు సూరదాసు. అంటే మీ ఇంటికే రావాలని ఎక్కడ ఉంది. మానవ జాతి అంతా నా బంధువులే అంటాడు. అంటే మనస్సు ఎంత వికసించిందో చూడండి. దానికోసం చెబుతున్నాను సూరదాసు చరిత్ర. అన్నగారికి ఇచ్చిన రిప్లై కోసం చెబుతున్నాను ఈ చరిత్ర. చరిత్ర చరిత్ర కోసం చెప్పటం లేదు. మీరు నాకు బంధువులు, నేను కాదు అనటం లేదు. కానీ ఇప్పుడు నా పరిస్థితి ఎలా ఉంది అంటే మనుషులు అందరూ నా బంధువులే అంటాడు. అంత కవిత్వం ఎలా వచ్చింది సూరదాసుకి? కేవలం అతని హృదయంలో తపన వల్ల, నేర్పుతోటి రాలేదు అది, కృష్ణుడు పట్ల అతనికి ఉన్న వాంఛ వల్ల, భగవంతుడి అనుగ్రహం వల్ల వచ్చిన విద్య.

అనుగ్రహం వల్ల వచ్చిన విద్య ఎంగిలి ముక్కలు లాగ ఉండదు అది ఆకాశగంగ. చెరువులోని నీరులోను, కాలువ నీరులోను నలకలు ఉంటాయి కానీ ఆకాశగంగలో నలకలు ఉండవు. సూరదాసు కవిత్వం అలాంటిది. అది ఆకాశ గంగ. అది ఒకళ్ళ దగ్గర నేర్చుకునే విద్య కాదు, భగవంతుడి అనుగ్రహం వల్ల అతనికి వచ్చిన విద్య. అది ఆకాశ గంగ. తపన అంటూ ఉండాలి. తపన ఉంటే తప్పనిసరిగా జరుగుతుంది. ఒక్క విద్య అనే కాదు ఏ విషయంలో అయినా అంతే. ఆత్మను తెలుసుకోవాలనే తపన హృదయం లోంచి రావాలి.

మీరు ఏదైనా మంచి పని చేశారు అనుకోండి తప్పనిసరిగా మిమ్మల్ని భగవంతుడు బహుమానాల తోటి అలంకరిస్తాడు. మీరు చేసిన మంచి పని వృధా పోదు. రామకృష్ణుడి తండ్రి ఛటోపాధ్యాయకి నూట యాభై ఎకరాల ఆస్తి ఉంది. ఆ గ్రామంలో ఏదో గొడవ వచ్చింది. ఆ గ్రామయజమాని నువ్వు మా తరపున కొన్ని అబద్ధాలు చెప్పాలి కోర్టుకి వచ్చి అన్నాడు. ఏవండీ మీరు అబద్ధాలు చెప్పమంటున్నారు, నేను అబద్ధాలు చెప్పను అని చెబుతాడు రామకృష్ణుడి తండ్రి. అయితే నువ్వు కనుక అబద్ధాలు చెప్పకపోతే ఎప్పటికైనా సరే నీ నూట యాభై ఎకరం నేను పోగొడతాను. అప్పటివరకు నేను విశ్రాంతి తీసుకోను నువ్వు అబద్ధాలు చెప్పకపోతే అంటాడు. నా నూట యాభై ఎకరం పోయినా సరే, నా సర్వస్వం పోయినా సరే, నా శరీరం పోయినా సరే, నేను అబద్ధం చెప్పను అంటాడు ఛటోపాధ్యాయ. ఏవండీ గ్రామస్తులు అందరూ ఏమనుకున్నారు అంటే ఎంత అమాయకుడో ఒక అబద్దం చెపితే పోతుంది కదా, వీడి ఆస్తి కూడా పోయేలా చేసుకుంటున్నాడు అనుకునేవారు. భగవంతుడికి తెలియదా మనం ఏమి చేస్తున్నామో? ఎంత తేడా ఉందో చూడండి ఇక్కడ. చిన్న అబద్ధం ఆడితే నూట యాభై ఎకరాలు నిలబడతాయి కదా అని గ్రామస్తులు అనుకుంటున్నారు. ఇతనికి వచ్చిన కఠోరమైన సంకల్పానికి భగవంతుడు చలిస్తున్నాడు. గ్రామ యజమాని పది సంవత్సరాలకో, ఇరవై సంవత్సరాలకో ఆ నూట యాభై ఎకరం చివరికి పోగొట్టాడు. పోగొడితే కట్టు గుడ్డల తోటి బయటకి వచ్చేశాడు ఛటోపాధ్యాయ. అప్పుడు పక్క ఊర్లో గుడిశె వేసుకుని జీవిస్తూ ఉంటాడు.

ఛటోపాధ్యాయకి ఆస్తి పోయింది అని బెంగ కూడా లేదు. నూట యాభై ఎకరం ఆస్తి పోతే అసలు బెంగ కూడా లేకుండా, నిశ్చలంగా ఉన్నాడు. అప్పుడు విష్ణువు ఒకసారి స్వప్నంలో కనిపించి చెబుతాడు "ఛటోపాధ్యాయా! ఛటోపాధ్యాయా! నాకు మీ ఇంటికి రావాలని ఉంది". ఇది ఎవరు చెబుతున్నాడు? భగవంతుడు చెబుతున్నాడు "కుదీరాం ఛటోపాధ్యాయ! నాకు మీ ఇంటికి రావాలని ఉంది, నాకు మీ ఇంటికి రావాలని ఉంది" అంటే సంతోషిస్తున్నాడు మా ఇంటికి వస్తాడు భగవంతుడు అని. ఇలా మూడుసార్లు అన్నాక

నాలుగో సారి "మీ ఇంటికి రావాలని ఉంది కానీ మాములుగా మటుకు రావాలని లేదు నీ కడుపున పుట్టాలని ఉంది" అన్నాడు మహావిష్ణువు. అప్పుడు చలించి "నువ్వు నా కడుపున పుట్టద్దు. నాకు ఉన్న నూట యాభై ఎకరం పోయింది, నేను తిండికి ఇబ్బంది పడుతున్నాను. నువ్వు నా కడుపున పుడితే నీకు నేను అన్నం ఎలా పెట్టగలను? నువ్వు విష్ణువు అంటున్నావు, నువ్వు భగవంతుడు అంటున్నావు, నీకు నేను అన్నం పెట్టలేను. నీకు బట్టలు ఇవ్వలేను, నువ్వు ఉండటానికి నీడని ఇవ్వలేను. అందుచేత నువ్వు భగవంతుడివి అయినా సరే నా కడుపున పుట్టి ధరిద్రం అనుభవించవద్దు. నువ్వు మా ఇంటికి వస్తే నాకు అభ్యంతరం లేదు, కానీ నా కడుపున పుట్టద్దు" అంటాడు. "నువ్వా మహా విష్ణువువి. సృష్టికి ప్రభువు. నేనా కుటీరంలో ఉన్నాను. ఇటువంటి దరిద్రుడి ఇంటికాడ పుట్టడం నీకు న్యాయమా? నువ్వు మా ఇంటికి రావద్దు స్వామి. నువ్వు మా ఇంటికి రావద్దు" అన్నాడు ఛటోపాధ్యాయ. అనేకమంది తపస్సులు చేశారు భగవంతుడి కోసం, తన కడుపున భగవంతుడిని పుట్టేలా చేసుకోవడం కోసం అనేకమంది తపస్సులు చేశారు. ఇక్కడ ఛటోపాధ్యాయ అంటున్నాడు "నువ్వు మా ఇంటికి రావద్దు. మా ఇంటికాడ నువ్వు పుడితే రెండు పూటలా నీ కడుపు నిండా అన్నం పెట్టలేను. కట్టుకోవడానికి గుడ్డలు ఇవ్వలేను. పడుకోవడానికి మంచం లేదు. ఉండడానికి నీడ కూడా నీకు సమకూర్చలేను. నా ఇంటికి వస్తాను అంటే బాగుంది అనుకున్నాను. నా కడుపున పుట్టటం నాకు ఇష్టం లేదు" అంటాడు ఛటోపాధ్యాయ. "నువ్వు పెట్టిన అన్నం తింటాను, ఏ గుడ్డ తెస్తే ఆ గుడ్డ కట్టుకుంటాను. నేనేమి పేచీలు పెట్టను" అని రాజీ పడుతున్నాడు భగవంతుడు. "నీ కడుపున పుట్టడానికి అంగీకరించు. నీ ఇష్టం తోటే పుడతాను నీ కడుపున" అంటాడు భగవంతుడు. అప్పుడు చలిస్తాడు ఛటోపాధ్యాయ. అప్పుడు కానీ తన అంగీకారాన్ని ఇవ్వలేదు మహావిష్ణువుకి. అప్పుడు రామకృష్ణ పరమహంసగా జన్మించాడు. ఇంత ఘర్షణ అయ్యింది అన్నమాట రామకృష్ణ పరమహంసగా జన్మించేముందు. ఇంత ఘర్షణ అయితేనే కానీ అతను కడుపున పడలేదు.



**స్వభావ రీత్యా మీకు ఏ పని అయితే సహజంగా అబ్బుతుందో, అది మీరు నిష్కామంగా చేయండి. మీకు మోక్షం వస్తుంది.**

లోకం దృష్టిలో ఛటోపాధ్యాయ మాములు వాడు, అమాయకుడు అవ్వచ్చు. కానీ ఆయనకు ఈశ్వరుడి అనుగ్రహం ఉంది. కొంతమంది రాళ్ళని ప్రేమించినట్టు కూడా మనుషులని ప్రేమించలేరు వాళ్లకి వేదాంతం ఎలా తెలుస్తుంది? రాళ్ళని ప్రేమిస్తారు కానీ మనుషులని ప్రేమించలేరు. మనిషికి మరొక పేరు దేవుడు. కొంతమంది రాళ్ళని ప్రేమిస్తారు. రాళ్ళని గౌరవిస్తారు. రాళ్ళ కోసం ఎంత డబ్బు అయినా ఖర్చు పెడతారు కానీ మనుషులని ప్రేమించలేరు. రమణస్వామితో ఆయన శరీరం విడిచి పెట్టేముందు అంటారు మీ విగ్రహం తయారు అయ్యిపోయింది, మద్రాసు నుంచి వస్తోంది. లారీలో వేసుకుని వస్తున్నారు అని చెపుతారు. మీ విగ్రహం వచ్చేస్తోంది అంటే రమణస్వామి సంతోషిస్తారని వీడు చెప్పేది. మనం ఎంతసేపు విగ్రహాలు చూస్తూ సంతోషిస్తాం, లోపాయికారిగా డబ్బులు ఇచ్చి విగ్రహాలు కూడా పెట్టించుకుంటాం. ఆయనకి విగ్రహాలు ఏమిటి? అంటే ఆయన సంతోషిస్తారని వీడి ఉద్దేశ్యం. అప్పుడు భగవాన్ అంటారు అవును మరీ, రాతి మనుషులు అందరికీ రాతి దేవుడు ఉండాలి అన్నారు. రమణస్వామిని ఎవరో ఒకసారి అడిగారు నువ్వు దేవుడిని చూశావా అని, నీ ఎదురుగా ఉన్నవాడు ఎవడో నీకు తెలియటం లేదు, దేవుడిని చూశావా అని అడుగుతున్నావు. కొంతమంది రాళ్ళకి వేలు, లక్షలు ఖర్చు పెడతారు. ఎండలో ఉన్న మనుషులని నీడకి కూడా రమ్మని అనలేరు. వాళ్ళకా అండి తత్త్వం తెలిసేది? అందరూ కూడా లెర్నింగ్ ఎందుకు అంటే earning కోసం అంటారు, అసలు డబ్బులు రావు అని ముందు తెలిస్తే చాలామంది చదువు కూడా నేర్చుకోరు. రామకృష్ణ పరమహంసని వాళ్ళ అన్నగారు అనేవారు మంత్రాలు రావు నీకు ఉద్యోగం ఎవడు ఇస్తాడురా? నువ్వు మంత్రాలు నేర్చుకో, మంత్రాలు నేర్చుకుంటే రూపాయలు వస్తాయి. నీ బ్రతుకు తెరువు బాగుంటుంది అని చెప్పేవాడు. అప్పుడు రామకృష్ణుడు "నాకు earning కోసం మటుకి learning వద్దు. అంటే సంపాదన కోసం చదువుకోను నేను" అని చెప్పేవాడు.

ఇక్కడ కూర్చున్న భక్తులలో ఒక హృదయంలో ఏదైనా గొప్పతనం ఉంది అనుకోండి ఆ గొప్పతనం నా కళ్ళతోటి నేను చూడలేకపోతున్నాను అంటే కారణం నాలో ఉన్న స్వార్థం. నాలో ఉన్న స్వార్థం నీలో ఉన్న గొప్పతనాన్ని చూడనివ్వదు. నా కళ్ళు కప్పేస్తుంది. నాలో ఉన్న అహంకారం, నాలో ఉన్న స్వార్థం, ఈ నేను నాది అనే భావన, నీలో ఉన్న సౌందర్యాన్ని, నీలో ఉన్న ఔన్నత్యాన్ని చూడనివ్వదు. నా కళ్ళను గుడ్డివాడి కింద చేస్తుంది. కళ్ళు ఉండి కూడా కళ్ళు లేనివాడి కింద అయిపోతాను. హృదయంలో స్వార్థం ఉన్నంతకాలం, వాడికి ప్రేమ ఉదయించదు. ప్రేమ ఉదయించనంత కాలం వాడికి దైవ సాక్షాత్కారం కానే కాదు. హృదయంలో స్వార్థం ఉన్నంతకాలం ఆ హృదయం లోంచి ప్రేమ ఉదయించదు. నూతి లోంచి నీరు ఎలా వస్తుందో, స్వార్థం తగ్గే కొలది ప్రేమ హృదయం నుండి పుట్టుకొస్తుంది.

ఎందుకంటే సోర్స్ అక్కడే ఉంది. నా హృదయంలో ఎప్పుడైతే స్వార్థం లేదో, అప్పుడే హృదయంలో ప్రేమ పుట్టుకొస్తుంది. ఆ ప్రేమ నాకు కలిగినప్పుడే నేను దేహాలకి అతీతం అవుతాను, రూపాలకి అతీతం అవుతాను, నామాలకి అతీతం అవుతాను, సృష్టికి కూడా అతీతం అవుతాను. అప్పుడు నేను ప్రేమ స్వరూపుడని అవుతాను. ఆ ప్రేమ లోంచే నాకు దైవ సాక్షాత్కారం కలుగుతుంది. హృదయపూర్వకంగా ప్రేమించే మనిషికి రోగమే ఉండదు. మీరు ఒక వంతెన కట్టచ్చు, ఒక మేడ కట్టచ్చు, ఒక ఇల్లు కట్టచ్చు. కానీ ఒక మనిషిని బాగు చెయ్యండి. దానికంటే ఇది గొప్పది. మనుషులని తయారు చెయ్యటం కష్టం అన్న సంగతి చాలామందికి తెలియదు. కృతజ్ఞత అనేది ఎలా ఉంటుందో తెలియని మనుషుల మాంసం తినడానికి కుక్కలు కూడా అసహ్యించుకుంటాయని రామాయణంలో వాల్మీకి చెప్పాడు. మీరు సాధన చేస్తున్నట్టు మీకు తెలియకూడదు సాధన పేరుమీద మీకు దుఃఖం రాకూడదు, మీరు బాధ పడకూడదు. మీరు గమ్యం చేరాలి. అది మన సత్సంగం యొక్క లక్ష్యం.

సూరదాసుతో అక్బరు “సూరదాస్ నువ్వు చూస్తే గుడ్డివాడవు. నీ వెనకాల ఏమీ లేదు. నిన్ను అమ్మా నాన్న విడిచి పెట్టేశారు, అన్నదమ్ములు విడిచి పెట్టేశారు, నువ్వు చూస్తే భగవంతుడి మీద అద్భుతమైన పాటలు పాడుతున్నావు. నిన్ను చూస్తే నాకు చాలా సంతోషంగా ఉంది. నువ్వు గుడ్డివాడవని నా అన్న వాళ్ళు అందరూ నిన్ను విడిచి పెట్టేశారు. నువ్వు ఎంత భక్తుడవు. నేను చక్రవర్తిని. భగవంతుడి మీద పాటలు నా ఆస్థానంలోని పండితులు కూడా నువ్వు పాడినట్టు పాడలేకపోతున్నారు సూరదాస్. అటువంటప్పుడు ఇటువంటి దీన స్థితిలో నువ్వు ఉండకూడదు. అది ఖండానికి అపచారం సూరదాస్. సమాజానికి శ్రేయస్సే కాదు, నీ లాంటి గొప్ప వ్యక్తులు ఇటువంటి దీన స్థితిలో ఉండటం మంచిది కాదు. నేను అక్బరుని, నీకు కొన్ని వందల ఎకరములు పట్టా ఇస్తాను, నువ్వు అనుభవించు సూరదాస్” అని అంటాడు. అప్పుడు సూరదాసు “ఓ అక్బర్ ఈ భూమి అంతా కూడా భగవంతుడిది అనుకుంటున్నాను. భగవంతుడి భూమిలో వంద ఎకరాలకి, రెండు వందల ఎకరాలకి నా పేరు మీద పట్టా ఎందుకు? అది కూడా నాకు వద్దు అక్బర్” అంటాడు. ఎక్కడ ఉన్నాడో చూడండి సూరదాస్. సమస్త భూమండలం అంతా భగవంతుడిదే, భగవంతుడి భూమిలో నా పేరు మీద పట్టా పుట్టిస్తావా? అది కూడా నాకు వద్దు అక్బర్ అంటాడు సూరదాస్. అంటే వాడు భౌతికంగా గుడ్డివాడే కానీ వాడి హృదయం ఎంత దూరం వెళ్ళిందో చూడండి.

ముష్టివాళ్ళు ఒకచోట విడిచి పెట్టి వెళ్ళిపోయిన తరువాత అంటే ముష్టి వాళ్లకి కూడా గుడ్డివాడు బరువు అయ్యాడు. కానీ భగవంతుడికి బరువు అవ్వలేదు. ముష్టివారు విడిచి పెట్టి వెళ్ళిపోయిన తరువాత ఎవరూ కనిపించటం లేదేంటి అని పాకుతూ, పాకుతూ,

నడుస్తూ, నడుస్తూ, పాడు నూతిలో పడతాడు, ఆయనకు కళ్ళు కనపడవు, ఆ నూతికి వర లేదు, సరిగ్గా వెళ్ళి పాడు నూతిలో పడతాడు. పాడు నూతిలో రెండు మూడు రోజులు అలా ఉండిపోతాడు, ఎవరూ చూడలేదు పాపం, అప్పుడు సాక్షాత్తూ కృష్ణస్వామి వచ్చి ఆ నూతిలో దిగి టచ్ చేసి బయటకి తీసుకు వచ్చాడు. ఆ టచ్ అమృత స్పర్శ, ఆ స్పర్శ నాకు జీవితంలో ఎన్నడూ మరుపు రాలేదు అన్నాడు సూరదాస్. స్వయంగా కృష్ణుడు వచ్చి నూతిలో దిగి, అతనిని చేతులతోటి పట్టుకుని బయటకి తీసాడు. (భగవంతుడు వచ్చి ఇతన్ని ముట్టుకోవడం ఆ స్పర్శ, నా జీవితంలో మరువరానిది అంటాడు సూరదాస్.) అప్పటి నుంచి విపరీతమైన కవిత్వం పుట్టుకు వచ్చింది సూరదాసుకి.

నీకు అసాధ్యం అయినవి, నాకు అసాధ్యం అయినవి, సమాజానికి అసాధ్యం అయినవి, ప్రభుత్వానికి అసాధ్యం అయినవి కూడా భగవంతుడు దృష్టిలో సాధ్యమే. ఒకసారి భగవాన్, కొంతమంది భక్తులు కూర్చొని ఉండగా, ఎవరో అరటి పళ్ళ అత్తం తెచ్చి అక్కడ పెట్టారు. ఒక కోతి అక్కడ కూర్చుంది, వీళ్ళు పరాకుగా ఎప్పుడు ఉంటారా, అరటిపళ్ళు అప్పుడు పట్టుకుపోదాం అని చూస్తోంది. భగవాన్, భక్తులు సడన్గా ఇటు చూసి, వాళ్ళు పరాకుగా ఉన్నారని కోతికి అనిపించింది, ఆ కోతి ఈ అరటి పళ్ళు పట్టుకుపోయింది. అప్పుడు భగవాన్ చక్కటి మాట అన్నారు. ఎవరి దృష్టి ఎక్కడ ఉంటుందో వాళ్లకి అదే లభిస్తుంది. ఎంత బావుందో చూడండి. ఎవరి దృష్టి ఎక్కడ ఉందో వాళ్ళకి తప్పనిసరిగా అది లభిస్తుంది. కోతుల దృష్టి ఎక్కడ ఉంది? అరటి పళ్ళు మీద ఉంది. అంటే అరటి పళ్ళు లభిస్తాయి. అలా మన దృష్టి లోక వస్తువుల మీద ఉంటే లోకమే లభిస్తుంది. మనకు మోక్షం మీద లేదు కాబట్టి మనకి మోక్షం లభించదు. మనకి భక్తి ఉంది నేను కాదు అనటం లేదు. కానీ మన దృష్టి లోకం మీదే ఉంది. మోక్షం మీద లేదు.

మనకి భక్తి ఉన్నమాట నిజమే. అయితే మన దృష్టి ఎక్కడ ఉంది? లోకం యొక్క వస్తువుల మీద ఉంది. మనకిమోక్షం ఎలా లభిస్తుంది? మనకు మోక్షం మీద దృష్టి ఉంటే మనకి మోక్షం లభిస్తుంది. మనకి భక్తి ఉంది కానీ మోక్షం మీద మన దృష్టి ఎవడికి అయినా ఉందా ఇక్కడ? బాగా ఆలోచించండి. భక్తి ఉన్నమాట నిజం. భక్తి లేకపోతే మీరు అందరూ ఎందుకు వస్తారమ్మా ఇంత కష్టపడి, కానీ దృష్టి ఎక్కడ ఉంది అని? ఏవండీ మనకి భక్తి ఉంది, ఈ భక్తి వల్ల మనకి జ్ఞానం రాదు అనుకోండి, ఏమి చేసుకుంటాం ఆ భక్తిని? జ్ఞానాన్ని తీసుకురాని భక్తి వల్ల ఉపయోగం ఏమిటి మనకి? లోకంలో ఏదో ఒకటి కోరుకుంటాం, అవి వస్తాయి. అవి ఎంతకాలం ఉంటాయి? పోనీ అవి ఉంటే మనం ఎంతకాలం ఉంటాం?

అరుణాచలం రమ్మని దీక్షితులగారికి చలంగారు ఉత్తరం వ్రాస్తే "రమణ భగవాన్ శరీరం ఇపుడు లేదు. ఉన్నదల్లా ఆ సమాధి. నాకు చూడాలని ఉన్నప్పుడే వస్తాను, ప్రస్తుతం రాను" అని దీక్షితులు గారు ఉత్తరం రాశారు అట చలం గారికి. "మీరు చెప్పింది యదార్థమే! భగవాన్ శరీరం ఇక్కడ లేని మాట నిజమే, భగవాన్ సమాధి ఎప్పడూ దర్శనం ఇస్తుంది. మీరు ఎప్పడు వచ్చినా ఫరవాలేదు కానీ మీ శరీరం మటుకు ఎప్పడూ ఉండదు అది గుర్తుంచుకోండి" అని వ్రాసారట చలంగారు.

ఏవండీ మన అందరికీ కూడా చావు అంటే భయం వేస్తుందా? నిజం చెప్పండి. మీ మనసుని మీరు మోసం చేసుకోవద్దు. నిజంగా మీరు చెప్పండి మన అందరికీ చావు అంటే భయం వేస్తుంది. ఇందులో ఏమైనా అనుమానం ఉందా? దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడికి చావు అంటే భయమే, దేవుడు లేడు అని చెప్పేవాడికి చావు అంటే భయమే. దేవుడు లేడు అని చెప్పేవాడికి వాడికి చావు వస్తుంది అంటే వాడికి భయమే. వాళ్ళని agnostic అంటారు. మనకి ఎంతో కొంత భక్తి ఉంది, చావు వస్తుంది అంటే మనకి భయమే. కారణం ఏమిటి? దీనికి ఏదో ఒకటి కారణం ఉండాలి కదా, మనకి ఎందుకు భయం వేస్తుంది? శరీరం ఉంటే అన్ని సుఖాలు అనుభవించవచ్చు. తన శరీరం వల్ల తాను సుఖపడుతున్నాను అనే భావన ఉంది కాబట్టి శరీరం పోతుంది అంటే వాడికి భయం వేస్తుంది అదే, అంటే చావంటే భయపడటానికి కారణం, తానుసుఖపడటానికి తన శరీరం ఉపయోగ పడుతుంది అనుకోవటం వల్ల వీడికి చావు అంటే భయం వేస్తుంది. తనకోసమే అది. శరీరం ఉంది కాబట్టి సినిమాలు చూస్తున్నాం. శరీరం లేకపోతే ఏ సినిమాకి వెళతాం? ఏవండీ శవాలు సినిమాలకి ఎక్కడకి వెళతాయి మరి, నేను చెప్పింది మీరు నమ్మద్దు. ఇంటికాడ ప్రశాంతంగా మీరు ఆలోచించుకోండి. నా శరీరం ఉంటేనే నేను సుఖపడతాను. శరీరం లేకపోతే నాకు సుఖం పోతుంది అనుకునే భావన వల్లే, నాకు చావంటే భయం వేస్తుంది. ఏమీ లేదు అండి మనం చెట్టుకి నీరు అందాలి అనుకోండి చెట్టుకి మొదలులో

**మన హృదయ స్థలంలో కనుక మనస్సుని లోపల అరికట్టి నిలబెట్టి ఉంచగలిగితే అదే భక్తి, అదే జ్ఞానం, అదే కర్మ, అదే యోగం.**



వేస్తే మొత్తానికి కొమ్మలకి, రెమ్మలకి, ఆకులకి అంతా నీరు అందిపోతుంది. మీరు చెట్టు మొదల్లో వెయ్యడం మానేసి ఏదో కొమ్మకి నీరు వేస్తే ఆ చెట్టుకి అంతాఅందుతుందా? అందదు. అదే విధంగా మన మొదలు ఏమిటి? మన ఆత్మ. మన మూలాన్ని, మన ఆత్మని తెలుసుకోవడం కోసం ప్రయత్నం చేస్తుంటే, చెట్టు మొదల్లో వేసిన నీరు మొత్తం ఆకులకి, రొబ్బలకి నీరు ఎలా అందుతుందో, అలా మనం ఆత్మని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తే అన్ని సద్గుణాలు వచ్చి మనకి అందుతాయి. ఆత్మనే మనం లక్ష్యంగా పెట్టుకుని, ఆత్మ మీదే దృష్టి పెట్టుకుని, ఆత్మని అన్వేషించటానికి మనం జీవితాన్ని ఖర్చు పెడుతుంటే, అన్ని సద్గుణాలు వచ్చి మనలని వరిస్తాయి. ప్రత్యేకంగా ఈ సద్గుణం రావాలి, ఈ సద్గుణం రావాలి అని మనం అనుకోవక్కరలేదు. అన్ని సద్గుణాలు వచ్చి మనలో పడతాయి.

మనకి మూడు అవస్థలు వస్తాయి అండి, ఇప్పుడు మనం జాగ్రదావస్థలో ఉన్నాం. రాత్రి నిద్ర పోతాం. అది సుషుప్తి అవస్థ. మళ్ళీ రాత్రి కలలు వస్తాయి. అది స్వప్నావస్థ. ఈ మూడు అవస్థలను చూసేది లోపల ఒకటి ఉంది. ఈ మూడు అవస్థలు కూడా తెరమీద బొమ్మలు నడుస్తున్నట్టు ఇవన్నీ ఆత్మ మీద నడుస్తాయి. నీ హృదయంలో ఉన్న దేవుడి మీద నీకు గౌరవం లేదు. గుళ్ళో ఉన్న దేవుడి మీద ఉంది. మనకి ద్వైత బుద్ధి ఉంది కాబట్టి దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు మనకోసమే పెట్టారు, మన అభివృద్ధి కోసమే పెట్టారు. గుళ్ళో ఉన్న దేవుడి దగ్గరకి వెళ్ళి నమస్కారం ఎందుకు పెట్టమన్నారు అంటే హృదయంలో ఉన్న ఆత్మని ఏనాటికైనా తెలుసుకోవడానికి ట్రైనింగ్‌లా ఉపయోగపడటం కోసం. నీ హృదయంలో ఉన్న దేవుడు నిజం. గుళ్ళో ఉన్న దేవుడు అబద్ధం. మనస్సుని లోపలకి పంపగలగాలి. సత్యం అనేది ఎక్కడ ఉందో, ఈశ్వరుడు యొక్క అస్థిత్వం ఎక్కడ ఉందో, స్వామి ఎక్కడ అయితే ప్రకాశిస్తున్నాడో అక్కడకి ఎవడైతే మన మనసుని పంపించగలుగుతాడో వాడే గురువు. భగవాన్ కి, మనకి ఈ జన్మలో ఏమీ సంబంధం లేకపోవచ్చు. ఏదో ఒకజన్మలో సంబంధం లేకపోతే ఆయన మీద మనకి ఆప్యాయతే కలగదు. మనకి ఏదైనా ఒక సంస్కారం లోపల ఉంది అనుకోండి, మనకి తలంపు వచ్చిన తరువాత తెలుస్తుంది ఆ సంస్కారం లోపల ఉందని, కానీ మనకి తలంపు రాకముందే ఏ సంస్కారం మనలో ఉందో భగవంతుడికి తెలుస్తుంది.

సోదరమహాశయులారా! భగవంతుడు భక్తి యోగం చెప్పాడు. భగవంతుడు జ్ఞాన యోగం చెప్పాడు. భగవంతుడు కర్మ యోగం చెప్పాడు. భగవంతుడు ధ్యాన యోగం చెప్పాడు. ఈ యోగాలు అన్నీ కూడా నేను ఎవడను అని తెలుసుకోవడం కోసమే భగవంతుడు చెప్పాడు అన్న సంగతి ఆ ప్రశ్నించేవాడికి తెలియదు. మళ్ళీ గుళ్ళోకి వెళ్ళి దణ్ణం పెట్టుకోమని చెబుతాడు.

గుళ్ళోకి వెళ్లి దణ్ణం పెట్టుకోవడం వలన ప్రయోజనం ఏమిటి? రాముడికి దణ్ణం పెట్టకపోతే రాముడు దుఃఖ పడతాడా? మీ దణ్ణాల కోసం దేవుళ్ళు కనిపెట్టుకున్నారా? వాళ్లకి దణ్ణం పెట్టడం ఎందుకు? మీరు ఎవరో మీరు తెలుసుకోవడం కోసం. మీరు నమస్కారం పెట్టలేదు అని వాడు బాధ పడితే వాడు దేవుడు అవుతాడా? మీరు ఎవరో మీకు తెలియనప్పుడు ఎన్ని తెలిస్తే మటుకు ప్రయోజనం ఏమిటి? ఒకటి లేని సున్నలే! ఏదైనా సరే ఒక వస్తువు ఉపయోగించుకోవడం కూడా మనకు తెలిసుండాలి, వస్తువు ఉంటే సరిపోదు. వస్తువు ఉపయోగించడం కూడా తెలిసి ఉండాలి. మీ ఇంట్లో వస్తువులు ఉన్నాయి అనుకోండి, వస్తువు ఉంటే సరిపోదు. వస్తువుని ఎలా ఉపయోగించుకోవాలో కూడా తెలిసి ఉండాలి. అలాగే మనకి శరీరాలు ఉన్నాయి. ఈ శరీరాలని ఎలా ఉపయోగించుకోవాలో కూడా తెలిసి ఉండాలి. అలాగే మనకి తెలివి తేటలు ఉన్నాయి. తెలివితేటలని కూడా ఎలా ఉపయోగించుకోవాలో తెలిసి ఉండాలి. ఈ తెలివితేటలతో లోకాన్ని, ఇతరులను మోసం చేయవచ్చు. ఈ తెలివితేటలతోనే భగవంతుని స్వరూపాన్ని తెలుసుకోవచ్చు.

మీలో ఎవరైనా ఒక కప్పులో విషం పోసి ఇది విషం మీకు ఇష్టమైతే తాగండి, లేకపోతే లేదు అని మీరు నా చేతికి ఇచ్చారు అనుకోండి, మీరు అంత ప్రమాదమైన మనుషులు కాదు. ఎందుచేత మీరు విషం ఇచ్చారు నాకు, ఇది విషం అని చెబుతున్నారు, చెప్పిన తరువాత కూడా నాకు ఇష్టమైతే పుచ్చుకుంటాను లేకపోతే లేదు. మీరు అంత ప్రమాదమైన మనుషులు కాదు. మరి ఎవరు ప్రమాదమైన మనుషులు అంటే కప్పులో సగం వరకు విషం పోసి పైన పాలు పోసి ఇది పాలు అని చెప్పేవాళ్ళు ప్రమాదం. కప్పులో కింద ఏమో విషం పోసి ఉంది పైన ఏముంది? పాలు ఉన్నాయి. ఇవి పాలు అని చెబుతారు అనుకోండి, మనం ఏమి చేస్తాం లోపల విషం ఉంది అని మనకి తెలియదు కాబట్టి పుచ్చుకుంటాం. కప్పు తోటి మొత్తం విషం ఇచ్చిన వాళ్ళు కంటే అందులో సగం కింద విషం పోసి పైన పాలు పోసి ఇవి పాలు అని చెప్పి మీరు పుచ్చుకోండి అని చెప్పేవాళ్లు ఎక్కువ ప్రమాదం. ఎందుచేత మనకి ఏది ఉన్నా, ధనం ఉన్నా, తెలివితేటలు ఉన్నా, దానంతట అది ఏమి చెడ్డ కాదు. దానిని ఉపయోగించుకోవటంలో ఉంది. ఏ వస్తువు కూడా చెడ్డ కాదు. ఆ వస్తువుని జాగ్రత్తగా మనం ఉపయోగించుకుంటే ఇంతకంటే మంచి పరిస్థితులు, మంచి జన్మలు ఈశ్వరుడు మనకి ప్రసాదిస్తాడు.


భగవద్గీతలో మనకి చెప్పినటువంటి ప్రతీ statement, ప్రాక్టికల్‌గా ఉపయోగించు కోవడానికి పనికి వచ్చేదే. మన జీవితానికి సంబంధించిన విషయాలు అందులో చెప్పాడు. మీరు కనుక ఈ జన్మలో జాగ్రత్తగా ఉంటే, మీ శరీరాలని, మనస్సుని జాగ్రత్తగా ఉపయోగించు

కుంటే మీ తెలివిని జాగ్రత్తగా మీరు ఉపయోగించుకుంటే భగవంతుడు మీకు ఇచ్చిన పరిస్థితులను జాగ్రత్తగా అవగాహన చేసుకుని, అర్థం చేసుకుని ఉపయోగించుకుంటే, ఇంకా మంచి పరిస్థితులను, ఉత్తమ జన్మలను ప్రసాదిస్తాడు. చెప్పేవాడికి తెలియాలి ముందు ఎలా జీవించాలో, చెప్పేవాడికి ఎలా జీవించాలో తెలియకపోతే చెప్పటానికి పనికిరాడు. మనకు అనేక పరిస్థితులు ఎదురు అవుతూ ఉంటాయి. ఒకసారి మనం అనుకున్నది ఒక్కటి, జరిగేది ఒకటి అవుతుంది. దానిని మనం ఎలా face చెయ్యాలి. అది కూడా ముఖ్యం. రమణ కేంద్రంలో కేవలం రమణ మహర్షి గారు చెప్పిన నాలుగు మాటలు చెప్పటం, కృష్ణుడు చెప్పిన నాలుగు మాటలు చెప్పటమే ప్రధానం కాదు రమణ సత్సంగం యొక్క ఉద్దేశం. మిమ్మల్ని ఎంతవరకు ఈ రమణ సత్సంగం educate చెయ్యగలుగుతోంది. అది రమణ సత్సంగం ధ్యేయం కానీ రమణ మహర్షి ఫలానా రోజున జన్మించాడు, ఫలానా రోజున మరణించాడు అని, కృష్ణుడు ఫలానా రోజున జన్మించాడు, ఫలానా రోజున మరణించాడు అని ఊరికే dates చెప్పడం కోసం కాదు. అలా చెప్పవచ్చును. కేవలం అంతమాత్రం చెప్పటానికి రమణసత్సంగం అక్కర్లేదు. మిమ్మల్ని ఎంతవరకు enlighten చెయ్యగలుగుతోంది రమణ సత్సంగం? ఎంతవరకు educate చెయ్యగలుగుతోంది? ఎంతవరకు దైనందిన జీవితంలో దీని ప్రభావం ఉంటోంది అది ముఖ్యం.

మనకున్న అవకాశాలని, చేతికి అందిన అవకాశాలని డబ్బు అవ్వనివ్వండి, తెలివి అవ్వనివ్వండి, భక్తి అవ్వనివ్వండి, పరిస్థితులు అవ్వనివ్వండి, ఏదైనా సరే మనకున్న పరిస్థితులని అవగాహన చేసుకుని, వాటిని జాగ్రత్తగా అవగాహన చేసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఈ లోకంలో ఉండగా, ఈ శరీరంలో ఉండగా, మీరు పరిస్థితులని అర్థం చేసుకుని ఏ కాలంలో మనం జన్మించాం, ఈ జన్మను maximum ఏ విధంగా మనం సద్వినియోగం చేసుకోవాలి అనేది చూసుకోవాలి? కాలాన్ని వృధా చెయ్యకూడదు. కాలాన్ని వృధా చేశాం అనుకోండి మనకి కాలం వస్తుంది. అంటే మరణం వచ్చేస్తుంది. అందుచేత మనం జాగ్రత్తగా ఉండాలి. భగవంతుడు వాసుదేవ స్వామి ఏమి చెప్పాడు అంటే ఏదో మీరు పుణ్యాలు చేసుకుంటే, మళ్ళీ జన్మలు మీరు ధనవంతులు కుటుంబంలో పుడతారు అని చెప్పాడు. ఏవో మంచి పనులు చెయ్యండి. మళ్ళీ జన్మలో ధనవంతుల కుటుంబంలో పుడతారు. అంటే ఏమిటి ఆయన ఉద్దేశ్యం. ధనవంతుల కుటుంబంలో పుడితే, రోజూ మనం ఇడ్లీలు తినచ్చు, పెసరట్లు తినచ్చు, సరదాగా ఉండటానికి మనకి అవకాశం ఉంది అని కాదు కృష్ణుడు చెప్పేది, భగవంతుడు చెప్పిన ఉద్దేశ్యం ఏమిటి అంటే, మనిషి దారిద్ర్యం అనుభవిస్తున్నాడు అనుకోండి, వాడు మనసుని ఆత్మ యందు నిలబెట్టలేడు. అందుచేత మీరు ఆత్మాన్వేషణ చేసుకుంటే, సత్యాన్ని తెలుసుకోవడానికి

ప్రయత్నంచేస్తుంటే, ఇంతకంటే మంచి కుటుంబాలలో, ఇంతకంటే మంచి పరిస్థితుల్లో తీసుకెళ్ళి పెడతాను అన్నాడు. అంటే మిమ్మల్ని ధనవంతుల కుటుంబాలలో పెడతాను అంటే కేవలం తిండికి ధనవంతుల కుటుంబాలలో పెడతాను అని కాదు. అంటే బట్టకి, నీడకు ఇబ్బంది పడక్కరలేకుండా కాలాన్నంత భగవంతుడిని తెలుసుకోవడానికి ఖర్చు పెట్టడానికి తగినటువంటి ఆర్థిక పరిస్థితులలో పెడతాను అని అర్థం.

అంతకంటే ఇంకొక మంచిమాట చెప్పాడు. మీరు ఎక్కువ పుణ్యం చేసుకుంటే, ఎక్కువ సత్కర్మలు చేస్తే, ఎక్కువ మంచి విషయాలని శ్రవణం చేస్తే, ధనవంతుల కుటుంబాన్ని తీసి అవతల పాడేశాడు, యోగుల కుటుంబంలో తీసుకెళ్ళి పాడేస్తాను డైరెక్ట్‌గా అన్నాడు. మనకి డైరెక్ట్ expressలు ఉంటాయి. అవి మధ్య స్టేషన్‌లలో ఆగవు. అంటే destinationకి వెళ్ళిపోవడమే. యోగుల కుటుంబంలో జన్మింప చేస్తాను అన్నాడు. అంటే యోగుల కుటుంబంలో జన్మింప చేస్తే వాడి తండ్రి యోగి గానే కనిపిస్తాడు, వాళ్ళ అమ్మ యోగి గానే కనిపిస్తుంది, వాడి మేనమామ యోగి గానే కనిపిస్తాడు. ఇంక వాడికి చిన్నప్పుడే యోగి మనస్తత్వం వస్తూ ఉంటుంది. మనం పూర్వ జన్మలలో చేసినటువంటి బలీయమైనటువంటి ఆధ్యాత్మిక వాసనలు, యోగి కుటుంబంలో ఎప్పుడైతే పుట్టామో అప్పుడు మన సాధన విపరీతమైన వేగాన్ని అందుకుంటుంది. ఎందుచేత? మన ఇంట్లో వాళ్ళు అందరూ యోగులు గానే ఉంటారు. గొప్ప మనస్తత్వం తోటి ఉంటారు. వాళ్ళని చూసేటప్పటికి ఆ రకమైన అభిప్రాయాలు మనకి వస్తాయి. అది యోగుల కుటుంబంలో పుట్టడం వలన ప్రయోజనం. అసలే మనం ఇంటర్నల్‌గా మంచి వాసనల తోటి పుట్టాం. Externalగా చూస్తే ఇంట్లో వారందరూ యోగులుగా కనిపిస్తున్నారు. సడన్‌గా మనం జ్ఞానం పొందుతాం. అవే చివరి



**ఆత్మ అంటే భగవంతుని స్వరూపమే. భగవంతుని దయను పొందలేకపోతే, భగవంతునికి ఇష్టులు కాకపోతే భగవంతుడు మన హృదయంలో అత్యంత సమీపంగా ఉన్నప్పటికీ ఆయన స్వరూపాన్ని మనకి ఇవ్వడు. భగవంతునికి ఇష్టులు అవ్వాలంటే మన ఇంద్రియాలను జ్ఞానసముపార్జనకు ఉపయోగించుకోవాలి.**

జన్మలలోకి లాగేస్తాయి. సడన్‌గా destination లోకి వెళ్లిపోతాం. అంటే ఎక్కువ పుణ్యం చేసుకున్న వాడిని, జీవితాన్ని ఎక్కువ సద్వినియోగం చేసిన వాడిని తీసుకెళ్లి యోగుల వంశంలోజన్మింప చేసి అవకాశాలు చూపిస్తాను అంటున్నాడు. ఇది భగవంతుడు చెప్పిన మాట, నేనేమి కల్పించి చెప్పటం లేదు. భగవంతుడు చెప్పిన మాట నేను చెబుతున్నాను.

ఈ శరీరం స్మశానంలో బూడిద అయ్యిపోతుంది. జీవితం అంటే అంతకంటే ఏమి లేదు అటువంటి మాటలు మీరు అనద్దు. Life is endless. స్మశానంలో బూడిద అయ్యేది ఈ శరీరమే. కానీ మీ మనసు మటుకు కాదు. మీ సంస్కారం మటుకు కాదు. జీవితం అలా సాగుతూనే ఉంటుంది. ఎప్పటివరకు? జ్ఞానం కలిగేవరకు అలా శరీరాలు వస్తూ ఉంటాయి మనకి! నేను సత్యాన్ని, భగవంతుడు ఏమని చెప్పాడు అంటే నేను సత్యాన్ని కానీ నేను సత్యం అయినప్పటికీ నన్ను ఎవ్వరూ తెలుసుకోలేక పోతున్నారు ఏమిటి? చదువుకున్న వాళ్ళు అందరూ ఉన్నారు కదా, ఎవరికీ తెలియటం లేదు. నేను సత్యాన్ని, ఈ లోకానికి ఆధారంగా ఉన్నవాడిని నేను. కానీ లోకంలో ఎవరికీ నా గురించి తెలియటం లేదు అని కృష్ణుడు చెప్పాడు. ఎందుచేత తెలియటం లేదు? గుణాలు అడ్డు వస్తున్నాయి. మీలో ఎవరికి అయినా మంచి గుణం ఉంది అనుకోండి. మీ మంచి గుణం ఒప్పకోవడానికి నా అసూయ అడ్డు వస్తుంది. ఎక్కడో కృష్ణుడు దాకా ఎందుకు, మీలో ఎవరిలో అయినా ఒక మంచి గుణం ఉంటే, మీ మంచి గుణాన్ని ఒప్పకోవడానికి నా అసూయ అడ్డు వస్తుంది. గుణాలు మనుషులని మాయ చేస్తున్నాయి. లోకాన్ని మాయ చేస్తున్నాయి. అంటే ఎవడి గుణాలు వాడికే అడ్డు వస్తున్నాయి కాబట్టి, నేను సత్యాన్ని అయినప్పటికీ, వాడికి ఆధారంగా ఉన్నవాడిని నేనే అయినప్పటికీ, లోకానికి ఆధారంగా ఉన్నవాడిని నేనే అయినప్పటికీ, నా గురించి ఎవరికీ తెలియటం లేదు, నన్ను తెలుసుకోవటం లేదు. నన్ను ఎందుచేత తెలుసుకోవటం లేదు? ఎవడి గుణాలు వాడికి అడ్డు వస్తున్నాయి. ప్రకృతి గుణాలు అన్నీ అడ్డు వస్తున్నాయి. అందుచేత మీకు తెలియ బడటం లేదు. ప్రకృతి గుణాలే మోహం. శ్రద్ధగా ఆత్మ గురించి శ్రవణం చేసి శ్రవణం చేసి జ్ఞానం అనే ఖడ్గం తోటి ఎవడైతే తన మోహాన్ని తాను నరుకుకుంటాడో, ఎవడైతే జ్ఞానం యొక్క సహాయం తోటి తన అజ్ఞానాన్ని ఎవడైతే పోగొట్టుకుంటాడో, వాడికి నేను ఎవరినో తెలియ బడతానుఅని చెప్పాడు భగవంతుడు.

అయితే మన ప్రకృతి గుణాలు అడ్డు రావడం వలన మనం భగవంతుడు లేడు అనుకుంటున్నాం. ఆయన లేడని కాదు మన గుణాల వల్లే లేడు అనుకుంటున్నాం. ఈ మధ్యన ఒక పెద్దమనిషి నన్ను కలిశారు, ఆయన అన్నారు నాకు ఎనభై సంవత్సరాల వయస్సు వచ్చింది. నాకింక బ్రతకాలని లేదు, నాకు మార్పు కావాలి, change కావాలి. ఎనభై సంవత్సరాలు

భూమి మీద జీవించాను. ఇంక ఖాళీ చేసి నాకు వెళ్ళిపోవాలని ఉంది. వెళ్ళిపోవాలంటే మరణం రావాలి కదా, మరణం రాకుండా ఎక్కడకి వెళతారు? అందుచేత మరణం కోసం వేచి ఉన్నాను. ఇంక attain చెయ్యవలసినవి నాకు ఏమి కనిపించటం లేదు. నా మనస్సు ఇప్పుడు మార్పు కోరుతుంది. మార్పు కావాలి అంటే శరీరం లోకాన్ని విడిచి పెట్టి వెళ్ళిపోవాలి. కానీ టైం రావటం లేదు, time కోసం ఎదురు చూస్తున్నాను. ఈ ప్రపంచాన్ని విడిచి పెట్టి నాకు వెళ్ళిపోవాలని ఉంది. తరువాత స్వర్గ లోకం, నరక లోకం, ఏదో లోకం. మొత్తం మీద నాకు ఇప్పుడు మార్పు కావాలి. అసలు విషయం మర్చిపోతున్నాను, ఇంతకీ ఆయన ఏమి చెప్పాడు అంటే... ఈ ఎనభై సంవత్సరాలు జీవితం కూడా ఎలా జీవించాను అంటే భగవంతుడు లేడు అనుకునే జీవించాను. భగవంతుడు ఉన్నాడు అని ఎప్పుడూ అనుకోలేదు. కానీ ఇప్పుడు అనిపిస్తోంది ఉన్నాడు ఏమో ఒకవేళ అని, జీవించడం మటుకు లేడు అనే జీవించాను. ఎనభై సంవత్సరాలు కూడా భగవంతుడు లేడనే జీవించాను. భగవంతుడు లేడు అని చెప్పేవాడు ఎటువంటి పనులు చేస్తాడో అటువంటి పనులే చేశాను. భగవంతుడు లేడనే జీవించాను. భగవంతుడు ఉన్నాడు అని మటుకు జీవించలేదు. ఇప్పుడు అనిపిస్తుంది ఒకవేళ ఉన్నాడు ఏమో అని, పోనీ ఏదో ఒకలోకంలో పడేస్తాడు. మొత్తం మీద ఖాళీ చెయ్యాలి, ఈ లోకాన్ని ఖాళీ చెయ్యాలి. ఇంతకీ ఆయన చెప్పేది ఏమిటంటే, ఎనభై సంవత్సరాలు కూడా భగవంతుడు లేడనుకుని జీవించాను. ఉన్నాడు అనుకుని మటుకు జీవించలేదు. ఇప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో అంటున్నారు. పైకి చెప్పటం లేదు కానీ, హృదయంతరాళంలో ఏదో కొంత పిరికితనం ఉంది. పైకి ఊరికే నాతో ధైర్యంగా చెబుతున్నాడు కానీ భగవంతుడు లేడనుకునే ఎనభై సంవత్సరాలు జీవించాను. ఎనభై సంవత్సరాలు వచ్చి నెత్తిమీద పడ్డాయి. ఇప్పుడు కాకపోయినా రేపైనా మనం ఖాళీ చేసి వెళ్ళిపోవాలి కదా, భగవంతుడు ఉన్నాడేమో అనేటటువంటి భావాలు ఇప్పుడు కలుగుతున్నాయి అని చెబుతున్నాడు ఆయన. ఆ మాట చెప్పడం కోసం ఇది అంతా చెబుతున్నాను.

భగవంతుడు ఏమి చెప్పాడు అంటే మీరు చేసిన మంచి ఊరికే పోదు. మీకు ఇంతకంటే మంచి జన్మలు, మంచి అవకాశాలు ఇస్తాను. అందుకు సత్కర్మ చెయ్యండి అని చెబుతున్నాడు. అందుచేత మీకు ఎవరికి అయినా తెలివితేటలు కనుక ఉంటే తెలివితేటలు ఉండచ్చు మంచిదే కాదు అనటం లేదు. ఆ తెలివితేటలు మనం సద్వినియోగం చేసుకోవాలి, డబ్బుని సద్వినియోగం చేసుకోవాలి, బిడ్డలని సద్వినియోగం చేసుకోవాలి, అన్నీ సద్వినియోగం చేసుకోవాలి. భగవంతుడు మీకు కొన్ని అవకాశాలు ఎక్కువ ఇవ్వచ్చు. మీలో కొంతమంది అదృష్టవంతులు ఉండచ్చు. భగవంతుడు మీకొక అవకాశం ఇచ్చాడు.

ఈ అవకాశం భగవంతుడు ఇచ్చాడే, భగవంతుడు ఇవ్వకపోతే ఈ అవకాశం మనకి ఎలా కలుగుతుందని, భగవంతుడిని ఆధారంగా చేసుకుని, జీవుడిని శివుడితో సమానంగా పూజించి, తోటి మానవులని కనుక హృదయ పూర్వకంగా మీరు ప్రేమించగలిగితే మీ అహంకారం పలుచ బడుతుంది. అహంకారం రాలిపోతుంది. నేను మీ అందరినీ హృదయ పూర్వకంగా ప్రేమిస్తున్నాను అనుకోండి, నన్ను నేను మర్చిపోతాను. నన్ను నేను మర్చిపోయే కొలది నాలోని స్వార్థం తగ్గిపోతుంది, అహంకారం తగ్గిపోతుంది. అంటే నేను ఎక్కడికి వెళుతున్నాను? ఈశ్వరుడి వైపుకే ప్రయాణం చేస్తున్నాను.

ఎటువంటి పరిస్థితులలో అయినా సరే మన మనస్సు ఎదురు తిరగకుండా చూసుకోవాలి. పరిస్థితులని సద్వినియోగం చేసుకోవాలి. మన మనస్సులో బలం ఎంత ఉందో చూడటం కోసం, అది ఎంత ప్రశాంతంగా, సౌమ్యంగా ఉందో చూడటం కోసం కొన్ని వ్యతిరేఖ పరిస్థితులు కల్పిస్తాడు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పడు మన మనస్సు ఎంత కూల్‌గా ఉంది? అది ఈశ్వరుడు చూస్తాడు. ఇది మీరు బాగా అర్థం చేసుకోవాలి ఇది. మీరు ఏదైనా ఇష్టమైన వస్తువు తినేటప్పడు మీ మనస్సు ఎంత ప్రీతిగా ఉంటుందో, ఆత్మ గురించి వినేటప్పడు, ఆత్మ గురించి తెలుసుకోవాలనే కాంక్ష వచ్చినప్పడు హృదయంలో అంత ప్రీతి కనుక ఉంటే మీకు తప్పనిసరిగా జ్ఞానం కలుగుతుంది. మీ మనసుకి ఆ ప్రీతిపట్టాలి. అప్పడు ఆ మహిమ జరిగింది అని, ఇప్పడు ఈ మహిమ జరిగింది అని, ఇది జరిగింది అని, అది జరిగింది అని ఇలా చెప్పకుంటూ ఉంటారు కదా, మీరు ఆలోచించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటి అంటే ఈ మహిమలు ఎన్ని జరిగినా, ఈ గొడవలు ఎన్ని జరిగినా ఇవి ప్రపంచం లోవా? ఆత్మ లోవా? మీరు బాగా అర్థం చేసుకోండి. నిజమే, చాలా గొప్ప మహిమలు జరిగిపోతున్నాయి. చాలా గొప్ప గొప్ప విషయాలు జరిగి పోతున్నాయి. ఇవన్నీ నిజం అని అనుకుందాం. ఇవన్నీ ప్రపంచానికి సంబంధించినవా? లేకపోతే ఆత్మకి సంబంధించినవా? ఇవన్నీ మాయకి సంబంధించినవా? లేకపోతే ఆత్మకి సంబంధించినవా? ప్రపంచం నిజమా? లేకపోతే ఆత్మ నిజమా? అంటే మాయకి సంబంధించిన విషయాలు తెలుసుకోవడానికి మనం జీవితం అంతా ఖర్చు పెడుతున్నామా? ఆత్మని తెలుసుకోవడానికి, సత్యాన్ని తెలుసుకోవడానికి ఖర్చు పెడుతున్నామా?

ఇరవై నాలుగు గంటలు దర్శనం అంటే ఎవరు ఇవ్వగలరు? రాత్రి పగలు లేకుండా దర్శనం అంటే సామాన్యమా? ఇరవై నాలుగు గంటలు దర్శనం ఇచ్చే మహాత్ముడు ఎవడండి? చివరి రోజులలో మటుకి రమణస్వామి శరీరానికి నీరసంగా ఉందని తలుపులు వేసేసేవారు. తలుపులు వేసేస్తే ఈ భక్తులు పాపం వచ్చేవారు, స్వామి లోపల ఉన్నారు అనేవారు, తలుపులు

వేసేయడం ఒకరోజు భగవాన్ చూశారు, భగవాన్ ఏమి చేశారు అంటే బయటకి వచ్చి కూర్చొని మీరు తలుపులు వేసేసుకుంటున్నారు కదా వేసేసుకోండి అన్నారు. అది కాదండి స్వామి మీ శరీర పరిస్థితి ఏమి బాగోలేదు. మీ విశ్రాంతి కోసం తలుపులు వేసేస్తున్నాము అని చెప్పారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే మీరు నాకు మజ్జిగ అన్నం పెడుతున్నారా లేదా? పోనీ సాంబారు లేకపోయినా, ఇడ్లీ లేకపోయినా, మజ్జిగ అన్నం పెడుతున్నారు. దర్శనం ఇవ్వడానికి కూడా పనికిరాని ఈ శరీరానికి మజ్జిగ అన్నం కూడా ఎందుకు అన్నారు? నేను ఏమీ చెప్పటం లేదు మౌనంగా ఉన్నాను, నన్ను కళ్లతోటి చూస్తున్నారు. దర్శనం ఇవ్వడానికి కూడా పనికిరాని ఈ శరీరానికి మజ్జిగ అన్నం మటుకు ఎందుకు? అందరినీ ఈశ్వర స్వరూపంగా చూసుకోవాలని ఆయన ఉద్దేశ్యం. మనసుని మూసుకోమని, మనసు మీద మూత పెట్టమని, ఆత్మ తోటి చూడమని, అహంకారాన్ని మూసేయమని, అహంకారం మీద మూత పెట్టమని, ఏది చూసినా ఆత్మ తోటి చూడమని, దైవ దృష్టితో చూడమని, ఈశ్వర దృష్టితో చూడమని చెప్పటం. ఆత్మ దృష్టితో చూస్తే జ్ఞానం కలుగుతుంది, అహంకార దృష్టితో చూస్తే ఆరోజుకారోజు పతనం అయ్యిపోతారు. జిన్నూరులో ఏమి జరుగుతుందో మీరు చూస్తున్నారు. లోకంలో ఏమి జరుగుతుందో మీరు చూస్తున్నారు. మీ మనసులో ఏమి జరుగుతుందో మీ మనసు తోటి మీరు ఎప్పుడైనా చూశారా? మాట్లాడటం లేదేమిటండి? మీ జీవితంలో ఎప్పుడైనా అలా మీరు ప్రయత్నం చేశారా?

అహంకారాన్ని విడిచి పెట్టమని గీతలో పరమాత్మ అడుగుతున్నాడు. అహంకారం నిజంగా మంచిది అయితే విడిచి పెట్టమని అడుగుతాడా? అది చెప్పటం కాదు అడిగాడు. టీచింగ్ కాదు రిక్వెస్ట్. మీరు ప్రశాంతంగా ఆలోచించండి. మన జీవితాలని మన అహంకారం నడిపిస్తోంది. మీరు పూజలు చెయ్యండి, జపాలు చెయ్యండి, యాత్రలకి వెళ్లండి, మనం ఎన్ని చేసినప్పటికీ మన జీవితాన్ని నడిపేది మన అహంకారమే. ఇంక మనకి జ్ఞానం ఎలా కలుగుతుంది? జీవితాన్ని ఎవరు నడుపుతున్నారు? అహంకారమే నడుపుతోంది.

**మనస్సు వలన భగవంతుడిని ఎవరూ తెలుసుకోలేరు. కానీ భగవంతుడి మీద ఆ మనస్సు పెడితే మనసు కరిగిపోతుంది. జీవలక్షణాలు పోతాయి, దేవుని స్వరూపాన్ని పొందుతారు.**



అహంకారం నడుపుతున్నంత కాలం ఆ జీవితానికి జ్ఞానం కలిగే యోగం లేదు? పరమ శాంతి, పరమ సుఖం మీ కోసం కనిపెట్టుకునిఉన్నాయి. మిమ్మల్ని అహంకారం విడిచి పెట్టమని వాసుదేవ స్వామి అడగడం ఎందుకు అంటే మీరు అహంకారాన్ని విడిచిపెట్టిన వెంటనే పరమ సుఖం, పరమ శాంతి వచ్చి మిమ్మల్ని వరిస్తాయి. అందరినీ ఈశ్వర స్వరూపంగా చూసుకోవాలి అని ఆయన ఉద్దేశ్యం. అంటే అందరినీ ఈశ్వర స్వరూపంగా చూసుకుంటేనే కానీ జ్ఞానం రాదు. జ్ఞానం లేకపోతే మనిషి ఈశ్వరుడిలో లయం కాలేడు.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే, ఆయన శరీరానికి కూడా అంత ప్రాముఖ్యం ఇవ్వలేదు. మనస్సుకి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. అహంకారాన్ని విడిచి పెట్టేస్తే మీకు మనసు పవిత్రం అవుతుంది. జీవితంలో వచ్చే సంఘటనలు ఎదుర్కొంటూ, జీవితంలో వచ్చే పరిస్థితులని ఎదుర్కొంటూ, సంసారంలో వచ్చే కష్ట సుఖాలని ఈశ్వర ప్రసాదంగా అనుకొంటే మనసు పక్వానికి వస్తుంది, పక్వానికి వచ్చిన మనసు జ్ఞానం అందుకోగలదు అని భగవాన్ సందేశం. మనిషి చెడ్డ కర్మలు చేస్తున్నాడు అనుకోండి, అది ఎవరికి? శరీరానికి, మనస్సుకి ఆ చెడ్డ కర్మ. ఇది బాగా అర్థం చేసుకోండి మీరు. ఏదైనా చెడు తలంపు వచ్చింది అనుకోండి ఆ చెడు తలంపు తోటి మీరు కలుస్తారు. నేను చెడిపోయాను అనుకుంటారు. ఆ తలంపు మీరు కాదు. ఏదైనా మంచి తలంపు వచ్చింది అనుకోండి నాకు మంచి తలంపు వచ్చింది నేను పైకి వస్తున్నాను అనుకుంటారు. ఆ మంచి తలంపు మీరా? అది మీరు కాదు. చెడు తలంపు వల్ల చెడ్డ కర్మ రావచ్చు, మంచి తలంపు వల్ల మంచి కర్మ రావచ్చు. కానీ ఆ రెండూ నిజం కాదు. మీరు చెడు తలంపు కాదు, మంచి తలంపు కాదు, మీరు ఆత్మ. తలంపులు కొన్ని లక్షలు రానివ్వండి, కొన్ని వేలు రానివ్వండి, మీకు భయం ఎందుకు? అది మీరు కాదు కదా, కొంతమంది ఏమంటారు అంటే మా పరిస్థితులు చాలా బాగున్నాయి అండి సుఖంగా ఉన్నాం అంటారు. ఏవండీ అదే కనుక నిజం అయితే ఆ సుఖం ఎందుకు పోతోంది? కొంతమంది ఏమంటారు మా పరిస్థితి ఏమి బాలేదు అండి ఇప్పుడు చాలా దుఃఖ పరిస్థితిలో ఉన్నాం అంటారు. మళ్ళీ కొంతకాలానికి ఆ దుఃఖ పరిస్థితి మారిపోవచ్చు. ఎందుచేత? ప్రారబ్ధాన్ని బట్టి దుఃఖం వస్తూ ఉంటుంది, సుఖం వస్తూ ఉంటుంది. అవి రెండూ నిజం కాదు. శరీర ప్రారబ్ధాన్ని బట్టి ఒకొక్కసారి దారిద్ర్యం రావచ్చు, ఒకొక్కసారి ధనం రావచ్చు, ఒకొక్కసారి దుఃఖం రావచ్చు, ఒకొక్కసారి సుఖం రావచ్చు. ఒకొక్కసారి అనారోగ్యం రావచ్చు, ఒకొక్కసారి ఆరోగ్యంగా ఉండచ్చు. ఇదంతా ప్రకృతికి సంబంధించిన విషయాలు, చెడ్డ కర్మ మనం కాదు, మంచి కర్మ కూడా మనం కాదు. మనం ఎవరం? ఆత్మ.

చంటి పిల్లలకి కనుక లక్క పిడతలు, బొమ్మ కారులు, బొమ్మ రైళ్ళు ఇస్తే ఆడుకుంటారు.

మనం కూడా ఆడుకోవచ్చును కదా, ఎందుకు ఆడుకోవటం లేదు మనం? పెద్దవాళ్ళం అయ్యాం, తెలివైన వాళ్ళం అయ్యాం. అదంతా వట్టిది అని మనకి తెలుసు. లక్క పిడతల తోటి ఒకప్పుడు ఆడుకునేవాళ్ళం, అయితే ఇప్పుడు ఎందుకు ఆడుకోవటం లేదు? మనం పెద్దవాళ్ళం అయ్యాం, తెలివితేటలు సంపాదించాం, మన కోరికలు మారాయి, మన ఆదర్శాలు మారాయి, మన ఆశయాలు మారాయి, మన ఆకాంక్షలు మారాయి, మన అభిరుచులు మారాయి. లక్క పిడతల తోటి ఆడుకునే, బొమ్మల తోటి ఆడుకునే పిల్లలని చూస్తే మనకి ఏమనిపిస్తుందో, మనకున్న కోరికలు, మనకున్న ఆదర్శాలు, మన ప్రవర్తన జ్ఞానికి అలా కనిపిస్తాయి. జ్ఞాని మనల్ని అసహ్యించుకోడు. అసహ్యించుకునే వాడు జ్ఞానే కాదు. చంటి పిల్లలు ఆడుకుంటూ ఉంటారు లక్క పిడతల తోటి మనం వాళ్ళని అసహ్యించుకుంటామా? మనం ఆడుకోము కానీ వాళ్ళు ఆడుకుంటూ ఉంటే సరదాగా చూస్తాం. లక్కపిడతలు ఆడుకునే పిల్లలు ఎటువంటి వారో, జ్ఞాని దృష్టిలో మనం కూడా అటువంటి వారమే. మెదడు వికసించింది అనుకోండి మీ తెలివితేటలు పెరిగే కొలది మీ కోరికలు, మీ ఆలోచనలు కూడా మారతాయి ఇది మీరు చూసుకోవలసింది.

భగవాన్ ఎటువంటి సుప్రీమ్ స్టేట్ లో ఉన్నప్పటికీ, బయటకి మనకి సామాన్యంగానే కనిపిస్తారు. అది భగవాన్‌లో ఉన్న గొప్ప లక్షణం. భగవాన్ ఎటువంటి స్టేట్‌లో ఉన్నాడు? ఆయన గొప్ప స్టేట్‌లో ఉన్నాడు కానీ మనలాగే కనిపించేవాడు. మనతో పాటే భోజనం చేసేవాడు. మనతో పాటే మాట్లాడేవాడు. మనతో పాటే తిరిగేవాడు. ఆయనకి పూజలు అక్కర్లేదు, అభిషేకాలు అక్కర్లేదు, గౌరవాలు అక్కర్లేదు, మర్యాదలు అక్కర్లేదు. మనతో పాటే ఉండేవారు. కానీ లోపల సుప్రీమ్ స్టేట్ లో ఉన్నారు. కానీ పైకి మటుకి common man లాగ ఉన్నారు.

మీ దగ్గర నుంచి నేను గౌరవం కోరుతున్నాను అనుకోండి మాటవరసకి, నేను అజ్ఞానిని అని అర్థం చేసుకోండి. ఒక మనిషి గౌరవించడానికి, ఇంకొక మనిషి గౌరవింపబడడానికి ఇద్దరు ఉన్నారా? మీ అహంకారం గౌరవిస్తుంటే నా అహంకారం పొంగుతుంది. గౌరవించేది మీ అహంకారం, సంతోషించేది నా అహంకారం. రెండు ఉన్నాయా? ఆ వారానికి ఆ వారం, ఆ నెలకి ఆ నెల, ఆ సంవత్సరానికి ఆ సంవత్సరం మన మనస్సు విజృంభిస్తోందా లేకపోతే మనస్సు అణుగుతోందా? అణిగే మనస్సుకి జ్ఞానం వస్తుందా? విజృంభిస్తున్న మనస్సుకి జ్ఞానం వస్తుందా? అణిగిన మనస్సు సత్వగుణంలోకి వెళ్తుంది, విజృంభిస్తున్న మనసు రజోగుణంలోకి వెళ్తుంది. రజోగుణంలో ఉన్న మనసు ఘోరాలు చేస్తుంది. కేవలం జ్ఞానాన్ని మనకి పంచి ఇవ్వడం కోసం ఆ లోకం నుండి ఈ

లోకానికి దిగి వచ్చిన జ్ఞానగురువు రమణస్వామి.

రంగన్ తోటి "నా గొడవ నువ్వు ఎక్కడా ప్రస్తావించకు, నువ్వు మీ తమ్ముడు కలిపి నా గొడవ దేశం అంతా యాగీ చేసేస్తున్నారు, నా గొడవ మీరు ఎక్కడా ఎత్తకండి" అని భగవాన్ చెబుతున్నారు. అప్పుడు రంగన్ "నువ్వు చెప్పే మాటల వల్ల మేము కాంతి పొందుతున్నాం, నువ్వు చెప్పే మాటల వల్ల మేము శాంతి పొందుతున్నాం, నువ్వు చెప్పే మాటల వల్ల మేము సుఖం అనుభవిస్తున్నాం, మిగతా జనాలు కూడా సుఖం అనుభవించాలని మేము చెబుతున్నాము. నీ గొప్పల కోసం మేము చెప్పటం లేదు, మాకు చెప్పాలని చెబుతున్నాం. కాకులు కూడా ఎక్కడైనా అన్నం కనిపిస్తే మిగతా కాకుల్ని కేక వేసి తీసుకు వస్తాయి. కాకులుచేసేపని కూడా నేను చెయ్యలేనా" అంటాడు.

మీరు ఎవ్వరూ భగవాన్ దృష్టి నుంచి తప్పించుకోలేరు. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మీ ప్రమేయం ఉన్నా, మీ ప్రమేయం లేకపోయినా, మీరు సాధన చేసినా, సాధన చెయ్యలేకపోయినా, మీ శిరస్సు అంతా భగవాన్ నోట్లో ఉంది. భగవాన్ నోట్లో ఉన్న శిరస్సుని బయటకి తియ్యలేరు. మీకు ఓపిక ఉంటే సాధన చెయ్యచ్చు, ఓపిక లేకపోతే సాధన చెయ్యలేకపోవచ్చు, మీరు అందరూ టికెట్లు కొనుక్కున్నారు. భగవాన్ యొక్క గుప్పిట్లో, భగవాన్ యొక్క హృదయంలో, భగవాన్ యొక్క మనసులోతప్పనిసరిగా మీరు ఉన్నారు. బయట ఉన్న గాలే మన లోపల ఉంటే ఈ గాలినే ప్రాణం ప్రాణం అంటాం. మీ ప్రాణం గురించి మీరు ఆలోచించకండి. మీరు రోజు నాకు నమస్కారాలు పెడితే మీకు కలిసి వచ్చేది ఏమిటి? భగవాన్ చెప్పేవారు మీరు రోజు నాకు నమస్కారాలు కాదు మీరు పెట్టవలసింది. తనకి సేవ చెయ్యటం కన్నా, తన బోధ ప్రకారం, తాను చెప్పిన దాని ప్రకారం, తన వినతి ప్రకారం, తన ఉపదేశం ప్రకారం, నడుచుకోవటమే ముఖ్యం. తను చెప్పిన మాట ప్రకారం నడచు కోవటమే ముఖ్యం అని పదే పదే చెప్పేవారు.

చెప్పింది అర్థం చేసుకోవడం theory, దానిని ఆచరించడం practical. అయితే మాకు అర్థం అవటం లేదండి అని కొంతమంది అంటారు. అర్థం అవ్వటం లేదని విషయాన్ని విడిచి పెట్టకండి. మీ హృదయంలో నేనే ఆత్మగా ఉన్నాను. మీరు తపిస్తుంటే మీరు ఘర్షణ పడుతుంటే హృదయంలో మీరు మధన పడుతుంటే తెలుసుకోవాలి అనే కాంక్ష హృదయంలో బలీయంగా గట్టిగా, గాఢంగా, గూఢంగా కనుక ఉంటే, నేను ఎక్కడో లేను, మీ హృదయంలో ఆత్మగా నేను ఉన్నాను కాబట్టి మీ చేతులు కంటే, మీ కళ్ళు కంటే, మీ కాళ్ళు కంటే మీకున్న అన్ని ఇంద్రియాల కంటే మీకు దగ్గరగా ఆత్మగా ఉన్నాను. అందుచేత నీకు ఎటువంటి బుద్ధిని ప్రసాదిస్తే అర్థం అవుతుందో అటువంటి బుద్ధిని కూడా నేనే ప్రసాదిస్తాను అంటున్నాడు

పరమాత్మ. వీడి హృదయంలో తపన ఉంది, ప్రార్థిస్తున్నాడు, వీడికి అర్థం అవ్వటం లేదు అని మన ప్రార్థన ఆయన చెవిలో పడితే ఆ ప్రార్థన విని మనకి ఎటువంటి బుద్ధిని ప్రసాదిస్తే అర్థం అవుతుందో అటువంటి బుద్ధిని ఆయనే ఇస్తాడు.

మీలో కొంతమందికి తెలివితేటలు తక్కువ ఉండచ్చు, కొంతమందికి ఎక్కువ ఉండచ్చు. ఎక్కువ ఉన్న వాళ్ళు గర్వం తెచ్చుకోకండి. ఎందుచేత? ఆ తెలివితేటలు మీరు కాదు. మీలో కొంతమందికి తెలివితేటలు తక్కువ ఉండచ్చు. కొంతమందికి ఎక్కువ ఉండచ్చు. సర్వసాధారణంగా తెలివితేటలు ఎక్కువ ఉన్నవాళ్ళు ఏమనుకుంటారు అంటే తెలివి తక్కువ వాళ్ళు అందరూ దండుగఅని, మేము గొప్ప అని అనుకుంటారు. అలా అనుకోకండి అది మీరు కాదు కాబట్టి! మీరు ఆత్మని తెలుసుకోవాలి అంటే, మీరు శాంతిలో కూరుకు పోవాలి అంటే, జ్ఞానంలో కూరుకుపోవాలి అంటే మీకు ఎన్ని తెలివితేటలు ఉన్నా సరే, ఆ తెలివితేటల తోటి ఆత్మని చేరుకోలేమన్న సంగతి మీకు తెలియాలి. మీకు అర్థం అవుతుందా? నిజమైన తెలివైనవాడు ఎవడు అంటే తన తెలివితేటల తోటే తన తెలివిని ఎవడైతే దాటుతున్నాడో వాడు జ్ఞాని అవ్వగలడు. తెలివైన వాడి లక్షణం ఏమిటి అంటే తన తెలివిలో తాను బంధింపబడడు. తన తెలివిని సాకారంగా చేసుకుని తన తెలివిని ఉపయోగించుకుని తెలివి లోంచి విడుదల పొందుతాడు. సత్యాన్ని తెలుసుకోవడం కోసం తెలివిని ఉపయోగించుకుంటూ తెలివిని దాటినవాడు తెలివైనవాడు. ఈ రమణ మహర్షి లేడు, రమణమహర్షి లేడు అని మీరు అనుకొంటున్నారు. అరుణాచలం కొండే రమణ మహర్షి. కొండ మాట్లాడుతుందా? మాట్లాడదు. కొండ నడుస్తుందా? కొండ నడవదు. ఆ కొండే రమణమహర్షి.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **52010126418572 4 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా।**

**న చాభావయుతః శాంతిః అశాంతస్య కుతః సుఖం ॥ 2-66 ॥**

తాత్పర్యము: ఇంద్రియములు, మనస్సు వశమునందు ఉండని వానియందు నిశ్చయాత్మక బుద్ధి ఉండదు. అట్టి అయుక్త మనుష్యుని అంతఃకరణమునందు ఆస్తిక భావమే కలుగదు. తద్భావనాహీనుడైన వానికి శాంతి లభింపదు. మనశ్శాంతి లేనివానికి సుఖం ఎట్లు లభించును?

అమృతత్త్వం పొందాలంటే మనస్సు ఇంద్రియాలు అదుపులో ఉండాలి. చదువుల వల్ల అది పొందలేము. మనస్సు ఇంద్రియములు ఎవడికైతే అదుపులో ఉన్నాయో వాడే అమృతత్త్వం పొందగలడు. యుక్తుడు-అయుక్తుడు: మనస్సు ఇంద్రియములు అదుపులో ఉన్న వాడు యుక్తుడు. ఆ రెండూ అదుపులో లేని వాడు అయుక్తుడు. వాడి బుద్ధి ఒక నిశ్చయముగా ఉండదు. మనస్సు ఇంద్రియాలు ఎవడికైతే వశములో ఉండవో, వాడి మాట స్థిరత్వం ఉండదు, బుద్ధి స్థిరత్వం ఉండదు. ఏమిటి నిన్న అలా మాట్లాడావు ఈ రోజు అప్పుడే మాట మార్చేశావు అంటే, నేనేమీ చేస్తాను నిన్నేమో అలా తోచింది ఈవేళ ఇలా తోచింది అని చెపుతాడు. వాడి నోటికి ఎలా వస్తే అలా చెప్పేస్తాడు. నోట్లో నాలుక ఎటుపడితే అటు తిరిగిపోతూ ఉంటుంది. వాడు అయుక్తుడు.

ఎవడికైతే ఇంద్రియములు వశములో ఉండవో, వాడి బుద్ధి స్థిరంగా ఉండదు, అంటే ఒక నిశ్చయానికి రాలేడు. మనస్సు ఇంద్రియములు వాడి స్వాధీనములో లేకపోతే వాడి బుద్ధికి కుదురు రాదు. రోజుకో రకంగా ప్రవర్తిస్తూ ఉంటాడు. వాడు అమృతత్త్వం పొందటానికి పనికి రాడు. వాడి అంతఃకరణములో దోషాలు ఎక్కువ ఉంటాయి. అంతఃకరణము అంటే లోపల ఉన్న పనిముట్టు. అంతఃకరణములో, బుద్ధిలో, దోషాలు ఉన్న మనిషికి, సాధన మాట వదిలేయండి, భగవంతుడు అనేవాడు ఉన్నాడు అనే ఆస్తికబుద్ధి కూడా స్థిరంగా ఉండదు. ఒకవేళ ఎప్పుడైనా నమ్మకం ఉన్నా చెదిరిపోతూ ఉంటుంది. చాలా మంది వాళ్ళకి ఏమైనా కష్టపరిస్థితులు వస్తే, అనుకూలమైన పరిస్థితి లేకపోతే భక్తి వదిలేస్తారు. చాలా కాలం నుంచీ భక్తిగా ఉన్నాము, కానీ దేవుడు మాకు ఏమి ఉపకారం చేశాడు అని భక్తి వదిలేస్తారు.

అంతఃకరణం ఎవడికైతే నిర్మలంగా లేదో, నిశ్చలంగా లేదో, అంతఃకరణం ఎవడికైతే దోషపూరితంగా ఉందో, వాడికి కనీసం భగవంతుడి మీద సజీవమైన విశ్వాసం కూడా కలగదు. అంటే భగవంతుడు ఉన్నాడు అని నోటితోటి చెప్పినా, వాడి అంతఃకరణం మటుకు లేడని చెపుతూ ఉంటుంది. భగవంతుడు ఉన్నాడనే భావన స్థిరంగా లేనివాడికి శాంతి కలగదు. శాంతి లేని వాడికి సుఖము కలుగనే కలుగదు.పరిస్థితులు మనకి అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా, భగవంతుడి యందు ఎవడికైతే సజీవమైన విశ్వాసం లేదో వాడికి మనశ్శాంతి ఉండదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మీకు నాకు ఈ పంచభూతాలకి కంట్రోలర్ ఒకడు ఉన్నాడు. ఉన్నాడో లేడో అనే సందేహం లేకుండా, వాడు ఉన్నాడు అని స్థిరమైన బుద్ధి, స్థిరమైన విశ్వాసం కలిగిన వాడికి,సాధన తోటి నిమిత్తం లేకుండా అన్ని దుఃఖాలు నశిస్తాయి. ఎంత దూరం వెళ్ళి చెపుతున్నాడో చూడండి విశ్వాసాన్ని.

అంతేకానీ మనకి కష్టం వస్తే దేవుడు లేడు అనుకోవటం, రోజులు బాగుంటే దేవుడు ఉన్నాడు అనుకోవటం - మీ కష్టాలకి సుఖాలకి దేవుడికి సంబంధం ఏమిటి? మీరు చేసిందే మీకు ఎదురు వస్తోంది అని మీకు తెలియటం లేదు. మీరు మంచి చేస్తే మంచి ఎదురు వస్తుంది, చెడ్డ చేస్తే చెడ్డ ఎదురు వస్తుంది. దీనికి దేవుడికి సంబంధం ఏమిటి. ఇవి కర్మ ఫలితాలు. చేసేటప్పుడు తెలియకే పాపం చేస్తారు, తెలియక పొరపాటు చేస్తారు, అనుభవంలోకి వచ్చేటప్పటికి తెలుస్తూ ఉంటుంది, తెలిసుండి అనుభవిస్తారు. నిప్పు మీద

చెయ్యి వేసేవాడు కాలుతుందని తెలియకే వేస్తాడు. అంటుకున్నాక, నిప్పు మీద చెయ్యి వేస్తే కాలుతుందని తెలిసుండి అనుభవిస్తాడు. మళ్లీ నిప్పు మీద చెయ్యి వేయకూడదని కాలాక తెలుస్తుంది. మీ అంతఃకరణంలో దోషం లేనప్పుడు భగవంతుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం కలుగుతుంది. అప్పుడు మీ మనస్సు పరమాత్మని అతుక్కుపోతుంది.

ఇది జ్ఞాపకం ఉంచుకోండి, అంతఃకరణంలో దోషం ఉన్నవాడు ఎవడూ భగవంతుడిని నమ్మడు. సర్వేశ్వరుడిని విశ్వసించడు. కనీసం ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనేటటువంటి స్థిరమైన నమ్మకం మీకు ఉంటే, మీకు సాధన లేకపోయినప్పటికీ, యోగాభ్యాసాలు లేకపోయినప్పటికీ, యాత్రలు చెయ్యకపోయినప్పటికీ, మీరు ఎక్కడ కూర్చున్నప్పటికీ, మీకు నూటికి యాభై పాళ్ళు దుఃఖం పోతుంది. ఎంచేతంటే అప్పుడు ఏది వచ్చినా అది ఆయన ప్రసాదమే అనుకుంటారు. సుఖము వచ్చినప్పుడు ఆయన ప్రసాదం అనుకున్నప్పుడు, మరి దుఃఖం వచ్చినప్పుడు అది ఆయన ప్రసాదం కాదా! అందుచేత మీకు భగవంతుడి యందు నమ్మకం ఉంటే, విశ్వాసం స్థిరంగా ఉంటే, దాని వల్ల ప్రయోజనం ఏమిటంటే, మీ మనస్సు ఎక్కువ ఇబ్బంది పెట్టకుండా విషయాల లోనుంచి తప్పకుంటుంది.

ప్రతీ మనస్సుకి విషయ చింతన ఉంటుంది. అందరికీ ఒకటే ఉండదు, పూర్వ జన్మ సంస్కారాన్ని బట్టి ఒక్కో మనస్సుని ఒక్కో విషయం ఆకర్షిస్తుంది. దానిని బట్టి మన పూర్వ జన్మలు తెలుస్తా ఉంటాయి. ఏ విషయం మీదకి మన మనస్సు ఎక్కువ వెళ్తోందో, ఆ పని మనము పూర్వజన్మలో ఎక్కువ చేసినట్టు. ఏ బలహీనత మీదకి మన మనస్సు వెళ్తోందో, ఆ పని పూర్వజన్మలో ఎక్కువ చేసి ఉన్నాము కాబట్టి మనస్సు అలా వెళ్తుంది. ఈశ్వరుడి మీద మీకు నమ్మకం విశ్వాసం పెరుగుతా ఉంటే, మనస్సు ఆ విషయం తోటి ఉన్న సంబంధం తెంపుకొని దేవుడి పాదాలని అంటిపెట్టుకోవటానికి తిరిగి వచ్చేస్తుంది, అది మీకు లాభం, ఎక్కువ కష్టం పడక్కర లేకుండా, అది వెనక్కి తిరిగి వచ్చి భగవంతుడి పాదాలని పట్టుకొంటుంది. తక్కువ పెట్టుబడి తోటి ఎక్కువ లాభం! మీరు తక్కువ ప్రయత్నం చేసినా భగవంతుడి పట్ల విశ్వాసం ఉంటే, మనస్సు తొందరగా వెనక్కి వస్తుంది. మీరు ఎక్కువ ప్రయత్నం చేసినా, మీకు భగవంతుడి యందు విశ్వాసం లేకపోతే, బయటికి వెళ్ళిన మనస్సు మళ్లీ అంత వేగంగా లోపలికి రాదు అని చెప్పకుండా చెప్పటం.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సద్గురు ఆరాధన

సద్గురువు శ్రీనాన్నగారు తన పార్థివ శరీరాన్ని వీడి నాలుగు సంవత్సరములైనది. వారు శరీరధారియై ఉన్న కాలములో వలెనే నేటికీ, వారి ఉనికి స్ఫుటముగా అనుభూత మవుతోంది. సద్గురువు శ్రీనాన్నగారు తాను శరీరధారియై ఉన్న కాలములోనూ, అట్లే శరీరము విడిచిపెట్టిన తరువాత కాలములోనూ, అనేకమంది జిజ్ఞాసువులను జాగృతులను చేస్తూనే ఉన్నారు. సకల ప్రాణికోటి హృదయాలలో శుద్ధ చైతన్యరూపంలో అంతర్యామిగా ఉన్నది గురుపరమాత్మే! అహంకారం నశిస్తే మానవుడు ఎంత స్వేచ్ఛగా, హాయిగా, సహజంగా, జీవించగలడు అన్న దానికి మహాత్ముల జీవితమే ఉదాహరణ. ఉత్తముని ఆచరణయే ధర్మము అనిపించుకుంటుంది. అట్టి ఉత్తమ ధర్మాచరణ శ్రీనాన్నగారి సొంతం. ఇంట్లో ఒక మూల ఉంచబడిన పూలకుండీ నుండి వెలువడే పరిమళం ఆ గది అంతా సమానముగా వ్యాపించునట్లు, ప్రపంచంలో ఏ మూల, ఏ మహనీయుడు, గుట్టుగా జీవిస్తున్నా వారి అనుగ్రహం అందరికీ సమానముగా పంచబడుతుంది. అట్టి అనుగ్రహ స్వరూపమే సద్గురువు శ్రీనాన్నగారు. భక్తులను మీరందరూ మోక్ష సుఖాన్ని పొందాలి అని ఆశీర్వదించేవారు. శరణాగతి చెందిన భక్తుల నుదుటి వ్రాత మార్చి, వారి ప్రారబ్ధాన్ని హరింపజేయుటలో దిట్ట శ్రీనాన్నగారు. పూర్ణత్వాన్ని ప్రసాదించేవాడే గురువు. జ్ఞానానికి మించిన పవిత్రం చేసే వస్తువు వేరేమీ లేదు ఈ ప్రపంచములో, అట్టి జ్ఞానాన్నే తమ జీవితాంతం మనకు అందించారు. సద్గురు శ్రీనాన్నగారి బోధ వడ్డించిన విస్తరి. తేలిక పదాలతో తత్త్వ సారాన్ని కాచివడబోసారు. అట్టి తత్త్వసారాన్ని ఇముడ్చుకోవడమే మన కర్తవ్యం.

**ఓం తత్ సత్**

**(దిII 13-01-2022 ముక్కోటి ఏకాదశి రోజున - సద్గురు శ్రీనాన్నగారి ఆరాధన సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురువు పుట్టిన రోజు వారి శిష్యులు అందరికీ పండుగే

శ్రీనాన్నగారు వారి పుట్టినరోజు పండుగలో వారు ఇలా "పుట్టినరోజు అంటే అందరికీ సంతోషమే, పుట్టినది ఎందుకో తెలిసేది ఎందరికో?" అన్నారు. ఇంటిలో వాళ్లకు, రాజకీయ నాయకులకు, పారిశ్రామికవేత్తలకు ఇంకా ఎన్నో రంగాల్లో ఉన్న వారికి ఆ రోజు కేకు కట్‌చేసి ఆనందంగా సంబరాల్లో మునిగిపోతారు. కొందరు రాజకీయ నాయకుల అభిమానులు పత్రికల్లో వారి ఫొటోలు వేసి తన శుభాకాంక్షలను, కృతజ్ఞతలను తెలుపుతూ తన స్వామి భక్తిని చాటుతారు. అలాగే సినీ రంగంలోనూ. ఇక్కడ విషయాన్ని సునిసిత బుద్ధితో పరిశీలిస్తే "దేహం పుడుతుంది, దేహం చనిపోతుంది. ఆత్మకు చావు లేదు, పుట్టుక లేదు." మనం ఆత్మ స్వరూపులమే కానీ గురువు పుట్టినరోజు పండుగకు మురిసిపోరు. భక్తుల ఆనందం కోసమే కానియ్యండి అని మన స్థాయికి దిగి వచ్చి మనతో ఆనందిస్తారు. భగవాన్ కాలంలో ఈ పుట్టినరోజులు జరుపుకొనేవారు. వారు మౌనం వహించి ఇలా అనేవారు "పెద్ద పెద్ద పండితులు అంతా గొప్పగా మాట్లాడుతారట, మనలను మాట్లాడమనకుండా ఉంటే అదే పది వేలు" అనేవారు. శ్రీనాన్నగార్కి పుట్టినరోజు ఎందుకో తెలిసిన జ్ఞానులు కాబట్టి భక్తుల ఉబలాటం కోసం ఓపికగా ఉంటారు. జిన్నూరులో ఆయన శరీరధారిగా ఉన్నప్పుడు, శరీరం లేనప్పుడు విందు భోజనాలు జరుగుతున్నాయి. శ్రీనాన్నగారికి మొదటలో సన్నాయి మంగళ వాయిద్యాలతో వేదిక మీదకు తీసుకొనిరావటం భక్తుల తాకిడితో నాన్నగారు పాదాలు తాకుతారని భక్తులు రక్షణ వలయంగా ఏర్పాట్లు ఉండేవి. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించటాలు జరిగేవి. రామకృష్ణపరమహంసగారు వివేకానందతో "నీకు మూడు రోజులలో మరణం వస్తుంది అనగా ఆత్మానుభవం కలుగజేస్తాను ఇప్పడే నీకు ఆత్మానుభవానికి అర్హత ఉంది కానీ ఇయ్యను. ఇస్తే ప్రవచనాలు చెయ్యలేవు" అన్నారు. స్వామీజీ మీ చర్య దారుణమని వేదన పడ్డారు. స్వామీజీకి ఆత్మానుభవం కలుగజేసి పరమహంసగారు "నా శక్తిని అంతా నీకు ధారపోసి నేను బికారినైపోయాను" అన్నారు. బికారిని అయిపోయాను అంటే ఆయను అనుగ్రహం ఎప్పడూ ఉంటుంది, మరోలా కాదు. శ్రీనాన్నగార్కి అరుణాచలంలో ఆత్మానుభవం కలిగిందని వారి చరిత్ర చెబుతుంది. పరమహంసలాగే భగవాన్ తన శక్తిని అంతా ధారబోసారని అన్వయించుకోవచ్చు. మనం పరమపవిత్రులమైతే ఒక్క సెకను ఆలస్యం చెయ్యకుండా ఈశ్వరుడు ఆత్మానుభవాన్ని కలుగజేస్తాడు. రవీంద్రనాథ్ ఠాగూర్‌కు స్నానం చేస్తుండగా ఆత్మానుభవం కలిగింది. గురుగోవింద్ సింగ్‌కు కూలిగా ఒక షాపులో గోధుమలు కుంచంతో కొలుస్తూ ఉండగా పదమూడవ కుంచం కొలుస్తూ ఉండగా అంటే 'తేరా' అని హిందీ పదం అనగా దాని మరో అర్థం 'నువ్వే నేను' అని అర్థం దానితో వారికి ఆత్మానుభవం కలిగింది. శ్రీనాన్నగారు ఒక గురు పూర్ణిమ రోజున "మీరు ఈ గురు పూర్ణిమ రోజున మీ గురువుకు చేసే పూజలు మీ జీవితానికి బంగారు బాట అవుతుంది. గురువు మీ ఆత్మకు ఆత్మ నీలోని బలహీనతలను తొలగించుకొని సద్ వాసనలు కలుగజేస్తాడు. ఆయన దయ లేకుండా, ప్రేమ లేకుండా మీకు ప్రేమ కలుగదు" అన్నారు. భగవాన్ శరీరం ఉండగా లాభం పొందినవారికంటే ఆయన శరీరం లేనప్పడే లాభం పొందినవారు ఎక్కువ. అది శ్రీనాన్నగారికి వర్తిస్తుంది. అక్షరాలా అలాగే జరుగుతుంది. శ్రీనాన్నగారు "ఈ శరీరం లేకపోయినా మిమ్ములను అనుగ్రహించటానికి మరో శరీరం ధరించి మీ గురువు మిమ్ములను తరింపజేస్తాను" అన్నారు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966